# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 102 | విశాఖపట్నం | 11-1-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 102 | VISAKHAPATNAM | 11-1-2026 SUNDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



**రిపోర్టర్లు కావలెను**

పతాకం న్యూస్ — PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


### ఏపీలో సంక్రాంతి హడావిడి

# రద్దీగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు





**హైదరాబాద్, విజయవాడ, పతాకం న్యూస్:** సంక్రాంతికి కుటుంబాలతో ఊరెళుతున్నారా ఈసారి కూడా ప్రయాణకష్టాలు తప్పటం లేదు. ఏ బస్సులోనూ సీటు లేదు. ఏ రైలులోనూ బెర్తు లేదు. ఇక ప్రత్యేక బస్సులు, రైళ్లు అంటారా వాటిల్లోనూ ఇదే పరిస్థితి. పండుగకు ముందు హైదరాబాద్ రూట్‌లో పెద్దఎత్తున ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసే ఏపీఎస్‌ఆర్టీసీ ఈసారి అరకొర బస్సులు ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక రైళ్లను భారీగా ప్రకటిస్తారని ఆశించినా అదీ జరగలేదు. పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టలేక ఇంటికి వెళ్లకుండా ఉండలేక సామాన్య ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. సంబరాల సంక్రాంతి సమీపిస్తోంది. పండుగను సొంతూళ్లలో సరదాగా జరుపుకునేందుకు అంతా సిద్ధమవుతున్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం ఎక్కడెక్కడికో వెళ్లిన వారంతా సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. సంక్రాంతి పండుగకు హైదరాబాద్ సహా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏపీ ప్రజలు సొంతూళ్లకు తరలి వస్తారు. తెలంగాణలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈ రోజు నుంచే హైదరాబాద్ నుంచి ప్రజలు కుటుంబాలతో సహా సొంతూళ్లకు బయలు దేరేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏ వెబ్ సైట్ వెతికినా ఏ టికెట్ బుకింగ్ కౌంటర్‌కు వెళ్లినా టికెట్లు లేవనే సమాధానం వస్తోంది. బస్సులు, రైళ్లలో వెళ్లేందుకు రిజర్వేషన్ కేంద్రాలకు వెళ్లగా ఎక్కడా ఒక్క సీటు కూడా దొరకడం లేదు. దీంతో పండుగకు సొంతూళ్లకు (తరువాయి 2వ పేజీలో)

### నీటి విషయంలో గొడవ పడితే నష్టపోయేది

# తెలుగు ప్రజలే: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** నీటి విషయంలో గొడవలకు పోతే నష్టపోయేది తెలుగు ప్రజలే అని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలనుకోవడం తప్పా? మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరును మరోసారి తప్పుబట్టారు సీఎం చంద్రబాబు. నదులు ఎక్కడ పుడతాయో, నాగరికత ఎక్కడ మొదలైందో జగన్ కి తెలియదని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ కు కనీసం సింధూ నాగరికత గురించి కూడా అవగాహన లేదని మండిపడ్డారు. నదీగర్భానికి, నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. దేశ రాజధాని ఢిల్లీ సహా ప్రధాన నగరాలు నదీతీరాల వెంబడి ఉన్నందునే అభివృద్ధి చెందాయని అన్నారు. అంతేకాదు లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలు నదీ పరివాహక ప్రాంతంలోనే ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ప్రజలు బుద్ధి చెప్పినా.. రాజధానిపై ఇప్పటికీ విషం చిమ్ముతూనే ఉన్నారని జగన్ పై నిప్పులు చెరిగారు చంద్రబాబు. 'ఏపీలో రానున్న రెండేళ్లలో నీటి కొరత లేకుండా ప్రణాళికలు రూపొందించాం. దేశంలోనే ఉద్యానవన రంగంలో అగ్రస్థానంలో ఉన్నాం. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్-1గా నిలుస్తాం. దేశంలో ప్రతి రాష్ట్రం మనల్ని చూసి నేర్చుకునేలా ముందుకు సాగుతాం. . రాయలసీమకు నీరు అందించామనడానికి పట్టిసీమే ప్రత్యక్ష ఉదాహరణ. పట్టిసీమ ద్వారా రాయలసీమపై మాకున్న చిత్తశుద్ధిని చాటుకున్నాం. అందుకే ప్రజలు మా పాలన కోరుకున్నారు. పట్టిసీమ వల్లే రాయలసీమలో ఉద్యానరంగం అభివృద్ధి పూర్తి చేయకుండా 2020లోనే నిలిపివేశారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారన్నారు.



5లో

**అడవులను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం అడుగులు?**

వాణిజ్య తోటల పెంపకానికి మోడీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**చలికాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే..!**



6లో



2లో

**కోనసీమలో బ్లోఅవుట్.. ఎట్టకేలకు ఆరిన మంటలు**

# వైసీపీపై మంత్రి వాసంశెట్టి ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** తిరుమల పవిత్రతను లక్ష్యంగా చేసుకుని, కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు వైసీపీ ముష్కర మూక విష ప్రచారం చేస్తోందని, భక్తుల మనోభావాలతో చెలగాటమాడుతోందని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ తిరుమల క్షేత్రాన్ని భ్రష్టు పట్టించిందని, ఇప్పుడు కూడా తమ నీచ రాజకీయాలను వీడటం లేదని ధ్వజమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది హిందువులు పరమ పవిత్రంగా భావించే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి సుభాష్ విమర్శించారు. దేవుడంటే భయం, భక్తి లేని వ్యక్తిని టీటీడీ చైర్మన్‌గా నియమించి, దర్శనాలను వ్యాపారంగా మార్చే వారిని పాలకమండలిలోకి తీసుకురావడం ద్వారా తిరుమల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. గతంలో కొందరు నేతలు తమ అనుచరులతో కలిసి... డబ్బులు తీసుకుని 30-40 మందిని దర్శనాలకు తీసుకెళ్లిన ఘటనలు బహిరంగ రహస్యమని అన్నారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తూ వీఐపీ దర్శనాలను గణనీయంగా తగ్గించారని తెలిపారు.

### రాజధానిపై బురదజల్లే

# ప్రయత్నం: నారాయణ



**ఉండవల్లి, పతాకం న్యూస్:** అమరావతిపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలకు మంత్రి నారాయణ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం నాడు ఉండవల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీసు వద్ద మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ దృష్టిలో రాష్ట్ర రాజధాని ఎక్కడో చెప్పాలన్నారు. అమరావతి రాజధాని అని తమకు పూర్తి క్లారిటీ ఉందని.. వైసీపీ కూడా రాజధానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రివర్ బెడ్‌కు రివర్ బేసిన్‌కు తేడా తెలియకుండా మాట్లాడారని వ్యాఖ్యలు చేశారు. చాలా నగరాలు రివర్ బేసిన్‌లోనే మహా నగరాలుగా అభివృద్ధి చెందాయని మంత్రి తెలిపారు. రైతులతో మాట్లాడటానికి ఇష్టపడని నాయకులు ఇప్పుడు లేనిపోని ప్రేమ చూపిస్తారని మంత్రి నారాయణ మండిపడ్డారు. గత ప్రభుత్వ నిర్వాకంతోనే అమరావతి పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని విమర్శలు గుప్పించారు. అమరావతి నిర్మాణ పనులకు పారదర్శకంగా టెండర్లు పిలిచామని స్పష్టం చేశారు. రాజధానిపై బురద జల్లే ఉద్దేశంతో అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.


పతాకం న్యూస్ — APTEL/25/A2082 — PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## విస్ఫోటన సీమ!

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇసుమండలో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఒఎన్‌జిసి) బావిలో సోమవారం సంభవించిన బ్లోఅవుట్ కోనసీమ వాసులతోపాటు యావత్ రాష్ట్రాన్నీ కలవరపాటుకు గురి చేసింది. ప్రాణనష్టం లేకపోవడం పెద్ద ఊరట. బ్లోఅవుట్ ఉధృతి తగ్గినప్పటికీ మూడు రోజులైనా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. మంటలను అరికట్టేందుకు చర్యలు చేపట్టిన ఒఎన్‌జిసి అధికారులు, పూర్తిగా అదుపుకావడానికి మరికొన్ని రోజులు పడుతుందని చెబుతున్నారు. గ్యాస్, క్రూడ్ ఆయిల్ 30 మీటర్ల ఎత్తుకు ఉబికొచ్చి భారీ పేలుడు సంభవించి మంటలు వ్యాపించాయి. ప్రస్తుతం 10-15 మీటర్ల ఎత్తు వరకు మంటలు ఎగసిపడుతున్నాయి. అందువల్ల పూర్తిగా పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు కోనసీమ వాసుల కంటిపై నిద్ర ఉండదు. బ్లోఅవుట్ భయానికి మూడు గ్రామాల ప్రజలు బతుకుజీవుడా అని సురక్షత ప్రాంతాలకు పరుగులు తీశారు. విస్ఫోటనం ధాటికి వందలాది కొబ్బరి చెట్లు, వరి నారుమళ్లు, ఇతర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. బాధితులకు సముచిత స్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలి. బెంబేలెత్తిస్తున్న మలికిపురం బ్లోఅవుట్‌కు హేతువు ముమ్మాటికీ ఒఎన్‌జిసిలో పాదుకొల్పిన కార్పొరేటీకరణ, విధానాలే. ఒఎన్‌జిసి 2,600 మీటర్ల లోతు వరకు ఆయిల్, గ్యాస్ నిక్షపాలను వెలికి తీస్తుంది. ఆపైన డ్రిల్లింగ్ కోసం అనుభవం లేని ప్రైవేటు కంపెనీలకు కాంట్రాక్టులిస్తోంది. ఈ చర్య ప్రైవేటు దోపిడీకి పనికొస్తోంది. తాజాగా ప్రమాదం జరిగిన మోరీ బావి-5ను ఒఎన్‌జిసి 1993లో డ్రిల్లింగ్ చేసింది. ఈ బావిలో పీడనం అధికంగా ఉండటం వలన మరింత లోతుకు తవ్వకాలు ప్రమాదకరమని భావించి నిలిపేసింది. తిరిగి 2024లో ప్రెజర్ తక్కువుందని చెప్పి గుజరాత్‌కు చెందిన డీప్ అనే ప్రైవేటు సంస్థకు డ్రిల్లింగ్ నిమిత్తం ఒఎన్‌జిసి కాంట్రాక్టుకు ఇచ్చింది. విస్ఫోటనం జరిగిన రోజున 2,600 మీటర్ల లోతులో ఒక లేయర్‌లో ఎక్స్‌ప్లరేషన్‌కు ప్రయత్నించారు. ఆ సమయంలో బావిలో అధిక పీడనం ఉందని నిర్ధారణ అయింది. లో ప్రెజర్ ఉందని డీప్ సంస్థకు డ్రిల్లింగ్‌నకు కాంట్రాక్టు ఇచ్చిన ఫలితం భారీ విస్ఫోటనం. తప్పుడు సమాచారంతో ప్రైవేటు సంస్థకు కాంట్రాక్టు ఇవ్వడం వెనుక సదరు కంపెనీకి, ఒఎన్‌జిసి యాజమాన్యానికి మధ్య లాలూచీ ఉండే తీరాలి. బ్లోఅవుట్ సంభవించి రోజులు గడుస్తున్నా అటు ఒఎన్‌జిసి ఇటు డీప్ సంస్థలు వాస్తవాలను వెల్లడించకపోవడంతో అనుమానం పెరుగుతోంది. ప్రజల మాన ప్రాణాలు కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సైతం ప్రమాదానికి అసలు కారణాలపై స్పందించలేదు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిగితేనే నిజాలు బయట పడతాయి. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా నివారించడానికి ఆస్కారం ఉంటుంది. గోదావరి పరవళ్లు, పచ్చటి ప్రకృతి అందాలతో అలరారే కోనసీమలో చమురు, సహజవాయు నిక్షపాల అన్వేషణకు కొన్ని దశాబ్దాల క్రితం ఒఎన్‌జిసి అడుగుపెట్టింది. అప్పటి నుంచి ఆ ప్రాంత ప్రజలు నిప్పుల కొలిమిని గుండెలపై మోస్తున్నారు. పొలాల్లో, ఇళ్లమధ్య, కాళ్ల కింద ఆయిల్, గ్యాస్ పైపులైన్లతో భయం భయంగా బతుకీడుస్తున్నారు. ముప్పై ఏళ్ల క్రితం 1995 జనవరిలో ఎగసిన పాసర్లపూడి బ్లోఅవుట్‌ను అదుపు చేయడానికి 65 రోజులు పట్టింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రెండవ బ్లోఅవుట్. ఆరు వేల కుటుం బాలు సహాయ శిబిరాలలో తలదాచుకోవాల్సి వచ్చింది. పంట నష్టం, పర్యావరణ నష్టం అపారం. అంతకుముందు 1993లో కొమరాడలో 28 రోజులు, 1997లో దేవరపల్లిలో రెండు రోజులు, 2020లో ఉప్పూడిలో మూడు రోజులు బ్లోఅవుట్‌లు కొనసాగాయి. ఉప్పూడి విస్ఫోటనానికి కోల్‌కతాకు చెందిన పిఎఫ్‌హెచ్ అనే ప్రైవేటు సంస్థ డ్రిల్లింగ్ కారణమని తేల్చారు. 2014 జూన్ 27న మామిడికుదురు మండలం నగరంలో గెయిల్‌కు చెందిన మెయిన్ పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీకై 22 మంది చనిపోయారు. కాలం చెల్లిన పైప్‌లైన్లు, పరికరాలు, నిర్వహణాలోపం, ప్రైవేటు దోపిడీ వలన తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి పడటం కాకుండా శాశ్వత భద్రతా చర్యలు చేపట్టడం ఉత్తమం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, ఒఎన్‌జిసి, ఇత్యాది వ్యవస్థలు ఆ పని చేసి ప్రజలకు ప్రమాదాల భయాల నుంచి విముక్తి కల్పించాలి.

## కోనసీమలో బ్లోఅవుట్.. ఎట్టకేలకు ఆరిన మంటలు



**కోనసీమ, పతాకం న్యూస్:** అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో బ్లోఅవుట్ మంటలు శనివారం ఉదయం వరకు కొనసాగాయి. ఎగసిపడుతున్న అగ్నికీలలు తీవ్రత కాస్త తగ్గినా పూర్తిగా నియంత్రించేందుకు ఓఎన్‌జీసీ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. దగ్ధమైన 300 టన్నుల శకలాలను తొలగించారు. ఇప్పటివరకు 3 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ సహజవాయువు దగ్ధమైనట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. మలికిపురం మండలం ఇరుసుమండ వద్ద ఈనెల 5న సంభవించిన బ్లో అవుట్ శనివారం పూర్తిగా అదుపులోకి వచ్చింది. మొదటి రోజు కంటే అగ్నికీలల తీవ్రత కాస్త తగ్గినా పూర్తిగా నియంత్రించేందుకు ఓఎన్‌జీసీ నిపుణుల బృందం తీవ్రంగా శ్రమించింది. ఓఎన్‌జీసీ టెక్నాలజీస్ ఫీల్డ్ సర్వీసెస్ డైరెక్టర్ విక్రమ్ సక్సేనా, ఓఎన్‌జీసీ, ఎంసీఎంటీ బఅంద హెడ్ శ్రీహరి నేతృత్వంలో రిస్క్ ఆపరేషన్ పూర్తయింది. గూడపల్లి పంట కాల్వ నుంచి నీటిని వినియోగించుకొని అగ్నికీలలను చల్లబరుస్తూ పూర్తిగా మంటను అదుపు చేశారు. 5 వేల జీపీఎం సామర్థ్యం గల పంపుతో నీటిని భారీ పైపులతో మంటలపైకి పంపుతున్నారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు అమెరికాకు చెందిన ప్రత్యేక సాంకేతిక బృందం ఇక్కడకు వస్తుందని మొదట్లో అధికారులు వెల్లడించారు. రోజురోజుకూ మంటల తీవ్రత తగ్గడంతో పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతోనే మన సాంకేతిక నిపుణుల బఅందంతోనే మంటలు అదుపుచేశారు . బ్లో అవుట్ మంటలకు దగ్ధమైన భారీ యంత్రాల శకలాలు తొలగింపు ప్రక్రియ వేగం పుంజుకుంది. ఇప్పటి వరకు సుమారు 300 మెట్రిక్ టన్నుల బరువు గల శకలాలను ఆ ప్రదేశం నుంచి భారీ క్రేనుల సహాయంతో బయటకు తీశారు. మరో 300 నుంచి 400 టన్నుల బరువు గల శకలాలు కూడా పూర్తిగా తొలగించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బ్లోఅవుట్ సంభవించిన డ్రిల్ సైట్లో మంటలు వ్యాపించిన బావి వద్దకు సీఎంటీ బఅందం చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ ను విజయవంతం చేశారు.

## సంక్రాంతి రద్దీ.. టోల్ గేట్ల వద్ద బారులు తీరిన వాహనాలు



**కంచికచర్ల, పతాకం న్యూస్:** సంక్రాంతి సెలవులు ఇవ్వటంతో హైదరాబాద్‌తో పాటు తెలంగాణ లో స్థిరపడిన ఆంధ్ర వాసులు సొంతూళ్ళకు బయలుదేరారు. దీంతో శనివారం తెల్లవారుజాము నుండి హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వచ్చే రహదారి పై వాహనాలు చీమలదండులా ఒకదాని వెనుక మరొకటి బారులు తీరాయి. గంటకు 200 నుండి 300 వరకు కార్లు ఈ రోడ్డు పై ప్రయాణించాయి. దీంతో హైదరాబాద్ శివారు నుండి విజయవాడ వరకు జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసింది. అటు తెలంగాణాలోని టోల్ గేట్లు, ఆంధ్ర లోని జగ్గయ్యపేట సమీపంలో గట్టు భీమవరం, కంచికచర్ల మండలం కీసర టోల్ గేట్ల వద్ద వాహనాలు రద్దీ ఏర్పడింది. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు పోలీస్, నేషనల్ హైవే సబ్బంది టోల్ ప్లాజాల వద్ద బూత్ లను పెంచారు. వాహనాలు ఆగకుండా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ డీసీపీ లక్ష్మ నారాయణ సిబ్బంది ని ఆదేశించారు. ఆదివారం నుండి విజయవాడ వైపు వచ్చే వాహనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## స్పీకర్ అయ్యన్న చేతులమీదుగా రూ.13.30 లక్షల సీఎం సహాయనిధి పంపిణీ చెక్కులు అందజేత



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం నర్సీపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు రూ.13,30,218 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, అనారోగ్యం మరియు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే నిరుపేదలకు సీఎం సహాయనిధి ఒక వరంలా మారిందని పేర్కొన్నారు. నేడు చెక్కులు అందుకున్న వారిలో నాతవరం మండలానికి చెందిన 9 మంది, నర్సీపట్నం టౌన్‌కు చెందిన 5 మంది, మాకవరపాలెం మండలానికి చెందిన 5 మంది, నర్సీపట్నం మండలానికి చెందిన ముగ్గురు, గొలుగొండ మండలానికి చెందిన ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. గత 19 నెలల కాలంలో నర్సీపట్నం నియోజకవర్గంలో ఇప్పటివరకు 136 మందికి సీఎం సహాయనిధి ద్వారా సుమారు రూ.1 కోటి 24 లక్షల 60 వేల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లోనూ ఈ నిధిని పారదర్శకంగా అందిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సంక్రాంతి సమయంలో ప్రయాణికుల నుంచి ప్రైవేటు బస్సుల నిర్వాహకులు అధిక చార్జీలు వసూలుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆయన మాధవధార ఉప రవాణా శాఖ కార్యాలయంలో కాంట్రాక్టు క్యారేజ్ బస్సుల యజమానులు, ఆపరేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బస్సుల నిర్వాహకులకు డీటీసీముఖ్య సూచనలు చేశారు. బస్సులు రద్దు చేయడం వంటి చర్యలతో ప్రయాణికులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. దూర ప్రాంత ప్రయాణాల్లో ఇద్దరు అనుభవజ్ఞులైన డ్రైవర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన హెల్ప్ లైన్ నంబరు 92816 07001 బస్సుల్లో ప్రయాణికులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు.

## హిందూజా బొగ్గు లారీలు, ఎన్టీపీసీ ధూళి లారీలను నిలుపుదల చేయాలి



**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలం, లంకెలపాలెంలో హిందూజా బొగ్గు లారీలు, ఎన్టిపిసి దూళి లారీలను ఈ మార్గం మీదగా నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టడంతో పాటు గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ హిందూజా బొగ్గు లారీలు ఈ మార్గం మీదగా ప్రయాణించడం వలన తీవ్రమైన బొగ్గు ఈ రోడ్లపై పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలాగే ఎన్టిపిసి దూళి లారీలు ఈ మార్గంపై కుప్పల కొలది లారీలు నిండు ధూళి రోడ్లపై వేసుకుంటూ లారీలు వెళుతున్నాయని దీనివలన లంకెలపాలెం గ్రామం పూర్తిగా ధూళితో కపివేయపడుతుందని లంకెలపాలెం జంక్షన్ లో ప్రజలు ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని గని శెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీలపై ఆర్టీవో అధికారులు దాడులు నిర్వహించే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మార్గంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని అన్నారు. హిందూజా కి రైల్వే ద్వారా బొగ్గు తరలించుకోవాలని డిమాండ్ చేశారు. మహారత్న పరిశ్రమగా ఉన్న ఎన్టిపిసి ప్రజల్ని రకంగా కాలుష్యానికి నెట్టు వేయడం అన్యాయం అన్నారు. వెంటనే బొగ్గు దూళి లారీలపై చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖాతా వెంకట్రావు, బోండా నర్సింగరావు, వి.రమణ, ఎం.దుర్గారావు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## రద్దీగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు

ఎలావెళ్లాలో తెలియక కష్టాలు పడుతున్నారు. సంక్రాంతి పండుగ ముందు తర్వాతి రోజుల్లో హైదరాబాద్ నుంచి ఏపీలోని పలు ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ రైళ్లలో 3 నెలల ముందే బెర్తులన్నీ నిండిపోయాయి. ప్రత్యేక రైళ్లపై ప్రయాణికులు ఆశలు పెట్టుకున్నారు. .సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. పండగ కోసం సొంత ఊళ్లకు వెళ్లేవారి సౌకర్యార్థం హైదరాబాద్ – విజయవాడ మధ్య మొత్తం 10 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైళ్లు పండగకు ముందు, తర్వాత రోజుల్లో రాకపోకలు సాగించనున్నాయి. ఎక్కువ మంది ప్రయాణించే 13న ఉన్న 3 ప్రత్యేక రైళ్లలో టికెట్లు బుకింగ్ చేసుకునేందుకూ అవకాశం లేదు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురం, కడప, చిత్తూరు తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలోనూ దాదాపు ఇదే పరిస్థితి. ఒక్క సీటూ లేదు. పలు రైళ్లలో కనీసం టికెట్ రిజర్వేషన్ చేసుకునే సదుపాయం కూడా లేకుండా రిగ్రెట్ వస్తోంది. దీంతో రైలు ఎలా ఎక్కాలో తెలియక ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రైళ్లలో సీటు దొరక్కపోయినా ఆర్టీసీ బస్సుల్లో సొంతూళ్లకు వెళదామనుకునే వారి ఆశలు ఈ సారి అడియాశలయ్యాయి. హైదరాబాద్ నుంచి పెద్దఎత్తున వచ్చే వారికి ఈసారి సరిపడ బస్సులు ఏర్పాటు చేయలేదు. ఏర్పాటు చేసిన బస్సులు ఏ పాటికీ సరిపోవడం లేదు. ప్రస్తుతం ఏ ఒక్క బస్సులోనూ ఒక్క సీటు కూడా ఖాళీగా లేదు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు అత్యధిక రద్దీ ఉంటుంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు నడిచే బస్సులు అన్నింటిలోనూ టికెట్లు అయిపోయాయి. ఈ రూట్లో అన్ని రోజుల్లో కలిపి ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు కేవలం 240 మాత్రమే. సగటున రోజుకు 20 ప్రత్యేక బస్సులు మాత్రమే ఉండగా వేటిలోనూ సీట్లు లేవు. ఈ నెల 9, 10, 11, 12, 13న హైదరాబాద్ నుంచి విజయవాడకు నడిచే ఏ ఒక్క బస్సులోనూ ప్రస్తుతం సీట్లు ఖాళీగా లేవు. హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైళ్లు, బస్సులు నిండిపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్‌లో వెళ్దామని ప్రయత్నిస్తే నిలువునా దోచేస్తున్నారు. విమానాలతో సమానంగా చార్జీలు వసూలు చేస్తూ జేబులు ఖాళీ చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు గరిష్టంగా టికెట్ ఖరీదు రూ.5000 వరకు ఉందంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఉత్తరాంధ్ర, రాయలసీమ సహా కోస్తాంధ్ర జిల్లాలకు వెళ్లే అన్ని మార్గాల్లోనూ రెండింతలు, మూడింతలు చార్జీలు వసూలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రైళ్లు, బస్సులు లేక ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ భరించలేక కష్టాలు పడుతున్నామని, ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక బస్సులు, రైళ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రయాణీకులతో రద్దీగా మారిన పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్



**పాడేరు, పతాకం న్యూస్:** సంక్రాంతి పండగ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్వగ్రామాలకు తీసుకువెళుతుండడంతో పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రైవేటు జీపులు, ఆటోల స్టాండ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. అదే విధంగా గిరిజన గ్రామాల్లో సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభం కావడంతో మైదాన ప్రాంతంలో ఉద్యోగాలు చేసేవారు, ఉపాధి కోసం వివిధ గ్రామాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు వస్తుండడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ మరింత రద్దీగా మారింది. మైదాన ప్రాంతంలోని వివిధ జిల్లాలో విద్యను అభ్యసించే విద్యార్థులు స్వగ్రామాలకు వెళ్లేందుకు రావడం, అదే విధంగా పండగ బట్టలకు పాడేరు వస్త్ర దుకాణాలకు వచ్చిన వారితో కళకళలాడాయి.

పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పాడేరు ఆర్టీసీ డిపో నుంచి అదనంగా ఆరు సర్వీసులను శుక్రవారం నుంచి నడుపుతున్నామని డిపో మేనేజర్ పసగాడ శ్రీనివాసరావు తెలిపారు. పాడేరు డిపో నుంచి విశాఖపట్నంకు 2, పాడేరు నుంచి చింతపల్లికి 2, పాడేరు నుంచి అరకులోయకు 2 అదనపు సర్వీసులను నడుపుతున్నామన్నారు.

## ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు పెంపునకు
## ఆరు నెలల ముందే ప్రణాళిక



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, మౌలిక వసతులు ఉన్నా, ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య పడిపోతూ వస్తోంది. స్థోమత ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్చుతున్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యా శాఖ ముందుగానే అప్రమత్తమైంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి మరో ఆరు నెలల సమయం ఉంది. అయినా ఇప్పటి నుంచే పాఠశాలల్లో పిల్లలు చేరేలా తమ పరిధిలో ఉన్న గ్రామాలు/వార్డుల్లో పర్యటించి తల్లిదండ్రులను కలుసుకుని వారితో మాట్లాడాలని ప్రాథమిక/యూపీ/ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించింది. పాఠశాలల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించింది. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలు, ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కలవాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో పథకాలు అమలు జరుగుతున్న తీరు, మౌలిక వసతుల గురించి వివరించాలి. విద్యార్థికి మధ్యాహ్న భోజనం అందించడంతోపాటు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, షూస్ ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, టీచర్లంతా ప్రతిభావంతులని చెప్పి, పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా చూడాలి. విశాఖ జిల్లాలో 560 ప్రభుత్వ ప్రాథమిక/యూపీ/ఉన్నత పాఠశాలల్లో 72,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 20 కంటే తక్కువగా ఉంది. ప్రధానంగా శివారు ప్రాంతాలు, గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఏటేటా తగ్గుతున్నారు. వచ్చే ఏడాది కొన్ని ప్రాథమిక పాఠశాలలను సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేసే ఆలోచన ఉంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యా శాఖ ముందుగానే అప్రమత్తమై విద్యార్థుల చేరిక పెరిగేలా ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే దీనికి సంబంధించి అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లలు చేరికలు పెంచడమే లక్ష్యంగా ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు.

## పండగల సందర్భంగా అక్రమ జూదం, కోడి పందాల నివారణకు కఠిన చర్యలు



**పెందుర్తి, పతాకం న్యూస్:** విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, రాబోయే పండగల నేపథ్యంలో పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో కోడి పందాలు,పేకాట, గుల్లాట తదితర అక్రమ జూద కార్యకలాపాలు జరగకుండా నివారించుటకు పెందుర్తి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగింది పండగల సమయంలో కొన్ని ప్రాంతాలలో అక్రమ కార్యకలాపాలు జరగ వచ్చుననే విశ్వసనీయ సమాచారం మేరకు, నాలుగు (4) ప్రత్యేక పోలీస్ బృందాలను (స్పెషల్ టీమ్స్) ఏర్పాటు చేసి, వాటిని నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లతో సూపర్వైజింగ్ చేయిస్తూ పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతర నిఘా మరియు గస్తీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రత్యేక బృందాలు కరకవాని పాలెం,ఎస్.ఆర్.పురం, చింతల గ్రహారం,లక్ష్మీపురం,చింతగట్ల, జెర్రిపోతులపాలెం,చీమలపల్లి, పొర్లుపాలెం, నారవ తదితర గ్రామాల అవుట్‌స్కర్ట్స్ ప్రాంతాల లో ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపట్టాయి పోలీసుల సమర్థవంత మైన ముందస్తు చర్యలు నిరంతర గస్తీ మరియు కఠిన నిఘా కారణం గా పై ప్రాంతాలలో ఏ విధమైన కోడి పందాలు గాని, జూద కార్య కలాపాలు గాని జరగకుండా పూర్తిగా నివారించబడినవి ప్రస్తుతం పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు ప్రశాంతం గా కొనసాగుతున్నాయి అక్రమ జూద కార్యకలాపాలలో పాల్గొనడం నేరమని అటువంటి చర్యల కు పాల్పడిన వారిపై కఠిన చట్ట పరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పెందుర్తి పోలీసులు హెచ్చరిస్తున్నారు ప్రజలు శాంతి యుతంగా పండగలు జరుపు కోవాలని ఎలాంటి అక్రమ కార్య కలాపాలకు సహకరించకూడదని కోరారు.

## వెలమ అంటే పది మందికి చేయూత ఇచ్చే వాడే

**పద్మనాయక వెలమ పేద విద్యార్థిని విద్యార్థులకు స్కాలర్ షిప్ పంపిణీ**





**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ విద్యాదాన నిధి కమిటీ ఆధ్వర్యములో పద్మనాయక వెలమ పేద విద్యార్థిని విద్యార్థులకు స్కాలర్ షిప్ చెక్కుల పంపిణీ జరిగింది. శ్రీ కృష్ణమనేని పాపారావు అధ్యక్షులుగా పెద్ద ఎత్తున 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఈ సారి 1 కోటి 5 లక్షల రూపాయలు శాంక్షన్ చేయగా, శనివారం నాడు హిమాయత్ నగర్ జలగం వెంగళరావు బాయిస్ హాస్టల్ లో పేద మరియు తండ్రిని కోల్పోయిన సుమారు 525 మంది పద్మనాయక వెలమ విద్యార్థిని విద్యార్థులకు స్కాలర్ షిప్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సమావేశములో "విద్యా దాన నిధి కమిటీ" కో-ఆర్డినేటర్ మరియు ఐవా ఉపాధ్యక్షులు తాండ్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ గతములో మన పెద్దలు,దాతలు,నిధులు సమీకరించి భవనాలు నిర్మించి వాటి ద్వారా ప్రతి ఏటా వచ్చే ఆదాయములో కొంత భాగము విద్యదాన నిధికి కేటాయిస్తారు ఈ నిధి నుండి లబ్ధిపొందిన విద్యార్థులు శ్రద్ధ క్రమశిక్షణతో చదువుకొని, భవిష్యత్ లో వారు స్థిరపడ్డాక బాధ్యతగా ఐవా ద్వారా పేద విద్యార్థులకు సహకరించాలని అన్నారు, విద్యదాన నిధి చైర్మన్ అయిల్నేని రవీందర్ రావు, కన్వీనర్ పోల్సాని రవీందర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐవా ప్రధాన కార్యదర్శి కోట్ల వీణ, కోశాధికారి హరీష్ చేప్యాల, ఆర్గనైసింగ్ సెక్రటరీ వడ్డేపల్లి దామోదర్ రావు కార్యవర్గ సభ్యులు గన్నమనేని క్రిష్ణ ప్రవీణ్ రావు,గొట్టిముక్కల భాస్కరరావు, ఉజ్జిని కిషన్ రావు, చిట్నేని సంజీవరావు, అల్లాడి రాజేందర్ రావు, మహిళా కార్యవర్గ సభ్యులు పడకంటి షర్మిల,మరియు జేవిఆర్ హాస్టల్ ఒ ఐటీ కమిటీల సభ్యులు తానిపర్తి వేణుగోపాల్ రావు, కొలుగురి శ్రీనివాస్ రావు వేముల శ్రీకాంత్ రావు మరియు స్కాలర్ షిప్ పొందిన విద్యార్థుల తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డిపోల ద్వారా సంక్రాంతి కానుక సరుకులు పంపిణీ చేయాలి: ఐద్వా డిమాండ్



**గొలుగొండ, పతాకం న్యూస్:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబానికి సంక్రాంతి కానుక రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం ఎన్. గదబపాలెంలోని రేషన్ షాపు వద్ద శనివారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆర్.మంగమ్మ మాట్లాడుతూ పండుగ వేళ నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, పేద ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.గతంలో మాదిరిగానే రేషన్ డిపోల ద్వారా కందిపప్పు,శనగపప్పు,మినప్పప్పు, పెసరపప్పు,బెల్లం,వంట నూనె, చింతపండు మరియు బియ్యం సహా మొత్తం 14 రకాల వస్తువులతో కూడిన కిట్టును ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సరుకులు పంపిణీ చేస్తేనే పేదలు సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోగలరని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు రాజలక్ష్మ,మంగమ్మ,నరసమ్మ, సూరమ్మ,లక్ష్మ, మల్లమ్మ,వరలక్ష్మ,కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల అభివృద్ధి బాధ్యత నాదే.. వారికి అన్ని విధాలా అండగా ఉంటా

- సచివాలయ ప్రధాన, అనుబంధ కమిటీలు వేయండి..
- మళ్ళీ వచ్చేది మన వైసీపీ ప్రభుత్వమే..
- పశ్చిమ సమన్వయ కమిటీలో మాజీ శాసనసభ్యులు మళ్ళ విజయ ప్రసాద్




**మల్కాపురం, పతాకం న్యూస్:** వైసిపి పార్టీని బూత్ స్థాయిలో పూర్తిగా బలోపేతమయ్యే దిశగా కృషి చేయాలని, మీ బాధ్యత నేను తీసుకుంటానని మాజీ శాసనసభ్యులు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ళ విజయ ప్రసాద్ వైసీపీ శ్రేణులకు సూచించారు. సీతమ్మదార కార్యాలయంలో శనివారం పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మళ్ళ విజయ ప్రసాద్ గారు మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ప్రధాన, అనుబంధ కమిటీలు వేయాలని వార్డ్ అధ్యక్షులకు,వార్డ్ పార్టీ పరిశీలకులకు ఆదేశించారు. ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని ఆయన తెలిపారు. పార్టీ ఆదేశాలు ప్రతి వార్డు అధ్యక్షుడు తప్పక పాటించాలని పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన వేల మంది కార్యకర్తలు వచ్చేలా కృషి చేయాలనీ పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వర రావు,వార్డ్ అధ్యక్షులు రేవల్ల సత్యనారాయణ , ఆడారి శ్రీనివాసరావు,పిలక రామ్ మోహన్ రెడ్డి,ఎలగడ రాజు,చుక్క ప్రసాద రెడ్డి, జియ్యని మారుతి,పిన్నింటి అప్పలరాజు పార్టీ పరిశీలకులు పూండి మల్లేశ్వర రావు, కాయిత పైడి రత్నాకర్,బాకీ శ్యామ్ కుమార్ రెడ్డి, యల్లపు వెంకటేశ్వర రావు,దొడ్డి కిరణ్, ఆళ్ళ పైడి రాజు,పిల్లా అనంత్,మళ్ళ శ్రీనివాసు రావు,సీనియర్ నాయకులు గుణుపూరు నరేష్,వాడ్రా సత్తిబాబు,ఆరిపాక అప్పారావు,శ్రీను, షేక్ రమణ,కృష్ణ అప్పారావు,ప్రశాంత్,కాళ్ళ మురళి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో 400 దుప్పట్లు పంపిణీ



**హుకుంపేట, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతాల్లో వివేక స్ఫూర్తి ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఉచిత దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గిరిజన కుటుంబాలకు 400 దుప్పట్లు పంపిణీ చేశారు.అనంతగిరి, హుకుంపేట, డుంబ్రిగూడ మండలాల్లోని 17 మారుమూల గిరిజన గ్రామాల్లో ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. కుసుమవలస, కంభవలస,లోచ్చులపుట్టు, కిటింగపుట్టు, ఎగసంతరి, జలగలబంధ, గట్టు, చీకటిపుట్టు, మద్దిపుట్టు, జంగంపుట్టు, దుర్గం, దాలిపుట్టు, కరకవలస, బొడ్డపుట్టు, పట్టం, వెంగడ తదితర గ్రామాల్లో దుప్పట్లు అందజేశారు.వివేక స్ఫూర్తి ఫౌండేషన్ ట్రస్టీ అనిల్ కుమార్ నేతృత్వంలో ఫౌండేషన్ సభ్యులు, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం కార్యదర్శి వంశీ మోహన్‌తో కలిసి కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన కుటుంబాలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆరోగ్యం, పరిశుభ్రత, సుస్థిర జీవన విధానాలపై అవగాహన కల్పించారు.ఈ సేవా కార్యక్రమం గిరిజన ప్రాంత ప్రజల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో ముందుగానే సంక్రాంతి వేడుకలు



**హుకుంపేట, పతాకం న్యూస్:** హుకుంపేట మండలంలోని స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో ముందుగానే సంక్రాంతి శోభ నెలకొంది. స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భోగి ఏర్పాటు చేసి మంటలు వెలిగించి గిరిజన సంస్కృతి సంప్రదాయాలతో దింసా నృత్యాలు చేస్తూ భోగి మంట చుట్టు నృత్యాలు చేశారు. అనంతరం కుండలోని పొంగలి వంటకాలు పంపిణీ చేశారు . అనంతరం కేజీబీవీ ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలు కలిగిన భారత దేశంలో ఉంటూ ఆచారాలు, సాంప్రదాయాలు పాటిస్తూ పండగ చేసుకోవడం శుభపరిమాణమన్నారు. సెలవులకు ముందుగానే పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో కలిసి సంక్రాంతి వేడుకలు పాఠశాల నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె అన్నారు. విద్యార్థులు సంతోషంగా ఆనందంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటేనే విద్యా వ్యవస్థ మెరుగుపడుతుందని అటువంటి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలన్నారు. నిత్యం పాఠాలు బోధిస్తూ బిజీ బిజీగా ఉండే ఉపాధ్యాయులు, పుస్తకాలు చదవడం, రాయడంలో బిజీగా ఉండే విద్యార్థులు అందరూ కలిసి ఆహ్లాదకరంగా మానసిక ఉల్లాసం పెంపొందించుకుంటూ పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందాయికంగానే ఉందని ఆమె అన్నారు.

## జోగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలం జోగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఉత్సాహవంతమైన సంబరాలు జరిగాయి. పాఠశాల ప్రధానో పాధ్యాయులు వి.నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు అందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు.పాఠశాల మొత్తం తెలుగుదనం ఉట్టిపడేలా అలంకరణలు, సాంప్రదాయ వాతావరణంతో కనిపించింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసికట్టుగా బోగి మంటలు వేసి ఉరుచుట్టు చేస్తూ డ్యాన్సులు,సాంప్రదాయ కార్యక్రమాల్లో మురిసిపోయారు. ముఖ్యంగా ఒక విద్యార్థి చేసిన హరిదాసు వేషధారణ అందరి దృష్టినీ ఆకర్షించింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వి.నాగభూషణం మాట్లాడుతూ పిల్లలకు మన సాంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యత తెలియాలి. ఆధునికతతో పాటు సంస్కృతిని కూడా కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అన్ని తరగతుల విద్యార్థులు,ఉపాధ్యాయ వర్గం ఉత్సాహంగా పాల్గొని సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

## ఏకలవ్య భూదాతకు న్యాయం చేయాలి: వైసీపీ నేతల డిమాండ్



**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా, డుంబ్రిగుడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి భూమి ఇచ్చిన భూదాత గొల్లోరి డొంబుకు న్యాయం చేయాలని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) మండల అధ్యక్షులు పాంగి పరశురాం, మాజీ ఎంపీటీసీలు తాంగుల రాందాస్, రామారావు డిమాండ్ చేశారు.సంతవలస గ్రామానికి చెందిన గొల్లోరి డొంబు తన సాగు భూమిని ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి అందుబాటులో ఉంచారు. ఇతర భూదాతలకు బదులు భూమి ఇచ్చినప్పటికీ, డొంబు కుటుంబానికి ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.భూదాత డిమాండ్ తాము ఇచ్చిన భూమికి బదులుగా మరో సాగు భూమిని ప్రభుత్వం అందుబాటు చేయాలి. అలా భూమి ఇచ్చిన తర్వాతే ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులు కొనసాగించాలని గొల్లోరి డొంబు కుటుంబ సభ్యులు కోరారు.వైసీపీ నేతలు పరశురాం, రాందాస్, రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే భూదాత గొల్లోరి డొంబు కుటుంబానికి బదులు భూమి కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణ భూదాత గొల్లోరి డొంబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ప్రధానమంత్రి సురక్షత మాతృత్వ అభియాన్



**అడ్డతీగల, పతాకం న్యూస్ :** అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు గర్భిణీలకు ప్రధానమంత్రి సురక్షత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ద్వారా, గర్భిణీ స్త్రీలకు ప్రస్తుత సంరక్షణను అందించేందుకు ఉద్దేశించబడినది అని డాక్టర్ సతీష్ అన్నారు. ఈ కార్యక్రమం ప్రతినెల తొమ్మిదవ తేదీనా మరియు పదో తేదీనా జరుగుతుంది అని,గర్భిణి స్త్రీలు అందరికీ సేవలు ఉచితం అని, అందరికి అందుబాటులో గవర్నమెంట్ హాస్పిటల్ లో ఉన్నయి అని అన్నారు.అలాగే ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ, తగిన సౌకర్యాలు,సమగ్రమైన ఉచిత ప్రసవానికి ముందు సంరక్షణను అందించడమే దీని యొక్క ముఖ్య ఉద్దేశం అని గౌరవ ప్రధానమంత్రి జూలై 31 2016న జరిగిన మాన్కి బాత్ ఎపిసోడ్ లో భాగంగా ప్రధానమంత్రి సురక్షత్ మాతృత్వ అభియాన్ ను మన దేశానికి పరిచయం చేశారు అని డాక్టర్ పి.మహేష్ రెడ్డి అన్నారు. అలాగే హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు మాట్లాడుతూ ఇది ఆరోగ్య కేంద్రాలలో గర్భం దాల్చిన రెండవ, మూడవ త్రైమాసికంలో మహిళలకు (పీ.ఎం.ఎస్.ఎం.ఏ) కనీస ప్రస్తుత సంరక్షణ ఇస్తుంది,అని అలాగే గర్భిణీ స్త్రీలకు పోషకాహారం తీసుకొని గర్భిణీ సమయంలో అధిక రక్తం పోకుండా,పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణీలకు మేలు జరుగుతుంది అని, అలాగే ఏ ఆహారం తీసుకుంటే రక్తం అధికంగా ఉంటుందో హాస్పిటల్ కౌన్సిలర్ వివరించారు. రంపచోడవరం నుంచి వచ్చిన గైనకాలజిస్ట్ డాక్టర్ బి. బి. మోమినా మాట్లాడుతూ ప్రసవానంతర కాలంలో సంరక్షణను అందించి తీవ్రమైన రక్తహీనత, గర్భధారణ, వల్ల కలిగే రక్తపోటు వంటి అధిక ప్రమాదకరకాలను, స్కానింగ్ ద్వారా సకాలంలో గుర్తించి చక్కగా వైద్యం అందించే విధంగా మరణాలను తగ్గించేందుకు,ఈ కార్యక్రమం మనకు అందుబాటులో ఉందన్నారు.

# మాటలతో మాయచేసే అటెన్షన్ డైవర్షన్ ముఠా అరెస్ట్



**గొలుగొండ, పతాకం న్యూస్:** మాటలతో మాయ చేస్తూ ప్రజలను బురిడీ కొట్టించి నగదు, నగలు అపహరించే అంతర్ జిల్లా అటెన్షన్ డైవర్షన్ ముఠా గుట్టును నర్సీపట్నం పోలీసులు రట్టు చేశారు. కేడీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసును ఛేదించి ఇద్దరు కిలాడీ మహిళలను అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుంచి 50 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఏఎల్ పురం గ్రామంలోని ఇండియన్ బ్యాంకు వద్ద నగదు డ్రా చేసిన ఓ వ్యక్తిని నిందితులు మాటల్లో పెట్టి చాకచక్యంగా దొంగతనానికి పాల్పడ్డారు. బాధితుడు ఇంటికి వెళ్ళాక తన బ్యాగులో నగదు లేకపోవడాన్ని గమనించి కేడీపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసును సవాలుగా తీసుకున్న కృష్ణదేవిపేట ఎస్.ఐ మరియు సిబ్బంది, నర్సీపట్నం డి.ఎస్.పి మరియు నర్సీపట్నం రూరల్ సి.ఐ పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు.బ్యాంకు పరిసరాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను విశ్లేషించి నిందితుల ఫోటోలను సేకరించారు. ఆ ఫోటోలను అనకాపల్లి, విశాఖపట్నం,కాకినాడ క్రైమ్ బ్రాంచ్ అధికారులకు పంపి ఆరా తీయగా, వారు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన పాత నేరస్తులు కుంబం నాగమణి,యెరసాని దేవిలుగా తేలింది. వీరిలో నాగమణిపై గతంలో గాజువాక,తాడేపల్లిగూడెం, భద్రాచలం పోలీస్ స్టేషన్లలో పలు దొంగతనం కేసులు ఉన్నాయని, వీరు జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చి మళ్ళీ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. శరభన్నపాలెం పరిసరాల్లో ఈ నిందితులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి మోసపూరిత విధానం అత్యంత ప్రమాదకరంగా ఉంటుందని పోలీసులు వెల్లడించారు. వీరు ముఠాలుగా ఏర్పడి సంతలు,తీర్థయాత్రలు, బ్యాంకులు,ఆర్టీసీ కాంప్లెక్స్ లు మరియు దేవాలయాల వద్ద రెక్కీ నిర్వహిస్తారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు చంటి పిల్లలను ఎత్తుకుని పాత సామాన్లు కొంటామని,జుట్టు సేకరిస్తామని లేదా వస్తువులకు మెరుగులు పెడతామని చెబుతూ ఇళ్ల వద్దకు వెళ్తుంటారు. ఒంటరిగా ఉన్న మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఒకరు మాటల్లో పెట్టగా,మరొకరు క్షణాల్లో నగదు లేదా నగలను కాజేసి తమ ముఠాలోని వేరే వ్యక్తికి ఇచ్చి అక్కడి నుంచి పరారవుతుంటారు.

## సాంకేతికతతోనే కేసుల దర్యాప్తు వేగవంతం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** కేసుల దర్యాప్తులో పారదర్శకత.. వేగం పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ పోలీసింగ్ విధానంలో భాగంగా అందుబాటులో ఉన్న సాంకేతిక అప్లికేషన్లపై ప్రతి అధికారి పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. సాంకేతికత వినియోగంలో పట్టుసాధించాలని స్పష్టం చేశారు. 'నాట్ గ్రిడ్ ద్వారా డేటా విశ్లేషణ, సీసీటీఎన్ఎస్‌లో ఎఫ్ఐఆర్ నుంచి చార్జ్‌షీట్ వరకు సమాచారాన్ని సకాలంలో నమోదు చేయాలి. క్రైమ్ మాక్ యాప్ ద్వారా అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర నేరగాళ్లను గుర్తించాలి. ఈ-సాక్ష్య ద్వారా డిజిటల్ ఆధారాలను భద్రపరచడాన్ని తప్పనిసరి చేయాలి. ఈ-సమన్స్ విధానంలో ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా సమన్లు పంపి సమయంతోపాటు ఖర్చును ఆదా చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే డయల్ 112 కాల్స్‌కు తక్షణమే స్పందించాలి. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయి. జిల్లాలోని మారుమూల, నిర్మానుష్య ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలి' అని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు షేక్ షాహాబాజ్ అహ్మద్, సీహెచ్ వివేకానంద, సీఐలు, ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు దృష్టికి మండల సమస్యలు



**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** మండలంలోని వివిధ గ్రామాల్లో తీరని సమస్యలు గా వెంటాడుతున్న పలు రహదారుల సమస్యలను శనివారం బుచ్చ య్యపేట మండల జనసేన నాయ కులు చోడవరం నియోజకవర్గం ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో గున్నేంపూడి, పెద మదీన, రాజాం, తురకలపూడి , కొండకొమ్ము, తిమ్మన్నపాలెం వయా కందిపూడి, పెదమదీన చినమదీన వరకు గల రహదారులు గురించి అలాగే వడ్డాది, విజయరామరాజుపేటల వద్ద నిర్మించవలసిన బ్రిడ్జి ల గురించి పవన్ కళ్యాణ్ దృష్టికి అత్యవసరంగా తీసుకు వెళ్లాలని నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో డిఎస్ నాయుడు, గోవిందరావు, దొండా సాయి, గుండు గణేష్, మండపాక బాబురావు, బుదిరెడ్ల అరుణ్, పోలిరాతి సత్తిబాబు, సోమిరెడ్డి రాము పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం



**సాలూరు, పతాకం న్యూస్:** పండుగలను జరుపుకోవడం ద్వారా అనాదిగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని రాష్ట్ర గిరిజన సంక్షమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంధ్యారాణి హాజరయ్యారు. మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు. అనంతరం భోగిమంటను వెలిగించి ఆనందాన్ని అందరిలో నింపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ కుటుంబం భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు అన్నదాతలు, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు, ప్రజలందరికి మంచి జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంచి పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కమిషనర్ రత్నకుమార్‌తో పాటు కౌన్సిలర్లు మజ్జి శైలజ, వైదేహి, వరలక్ష్మి, హర్షవర్ధన్, వరప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'రథసప్తమి'కి సన్నద్ధం



**అరసవల్లి, పతాకం న్యూస్:** అరసవల్లి సూర్యనారాయణ స్వామి జయంతి (రథసప్తమి)ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఈ నెల 19 నుంచి 25 వరకు ఏడు రోజుల పాటు జరిగే రథసప్తమి ఉత్సవాలకు సంబంధించిన స్వామివారి ప్రచార రథన్ని జెండా ఊపి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. రథసప్తమి ఉత్సవాల పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఉత్సవాలకు అంకురార్పణగా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఆదిత్యాలయ ఆవరణలో 200 మంది సాధకులతో సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన యోగ విన్యాసాలు అబ్బురపరిచాయి. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా అధికారులు, సాధకులతో సూర్యనమస్కారాలను మంత్రపూర్వకంగా చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రథసప్తమి వేడుకల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మికత, చైతన్యం ఉట్టిపడేలా కార్యక్రమాల రూపకల్పన జరిగిందన్నారు. శోభాయాత్ర, హాట్ ఎయిర్ బెలూన్, హెలికాప్టర్ రైడ్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలిపారు. జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు ఉంటాయన్నారు. ఈ నెల 21న నగరంలోని 80 అడుగుల రోడ్డులో 5వేల మందితో మెగా సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో కూడా సూర్యనమస్కారాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా అద్భుతంగా యోగసనాలు ప్రదర్శించిన చిన్నారి రాజహంసను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆలయ ఆవరణలో చెట్లు నాటారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ డీఆర్వో లక్ష్మణమూర్తి, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, సుడా ఈఈ పొగిరి సుగుణాకరరావు, ఆయుష్ అధికారి జగదీష్, యోగా గురువులు రామారావు, మురళీ, కొఠారి ఆదినారాయణ, కొల్లి వెంకటరావు, తంగి స్వాతి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు, వివిధ యోగా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవుల పొందిన నాయకులకు ఘన సన్మానం



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు ఆధ్వర్యంలో నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు, కార్యకర్తలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కూ టమి పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు కల్పించిన తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇంచార్జీ ఉమాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిలో ఊర్మిళ,డైరెక్టర్లు రాజేశ్వరి,కె.వరలక్ష్మి,బండారు సాంబమూర్తి, తోకల దేవి,చింతపల్లి మండలానికి చెందిన డైరెక్టర్లు చెన్నకేశవ నాయుడు,సేవ ఈశ్వరమ్మ,బేతాళుడు,అలాగే కొయ్యూరు మండల కోఆపరేటివ్ చైర్మన్ సుమర్ల సాంబశివ,డైరెక్టర్లు కూనిశెట్టి జోగారావు, బీజేపీ పార్టీకి చెందిన డైరెక్టర్ రీమల చంద్రరావు,చింతపల్లి కోఆపరేటివ్ చైర్మన్ అబ్బాయినాయుడులకు రాజేంద్రపాలెం సర్పంచ్ పేట సింహాచలం,బీజేపీ నాయకులు మేడిపోయిన చక్రరావు చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు,గాం రామాదేవి,కీర్తి కుమార్,జోగేంద్ర,మాజీ సర్పంచ్ లోతా రాజబాబు,కూనిశెట్టి చంద్రరావు,గాలి దేవుడుతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

## సంక్రాంతి జోష్.. భీమవరంలో గది అద్దె రూ. లక్ష!



**భీమవరం, పతాకం న్యూస్:** గోదావరి జిల్లాల్లో సంక్రాంతి సంబరాలు అప్పుడే అంబరాన్ని తాకాయి. ముఖ్యంగా కోడి పందేలకు కేంద్రబిందువైన భీమవరంలో ఈసారి పండుగ జోష్ గతానికి మించి కనిపిస్తోంది. పందేలను తిలకించేందుకు ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా జనం తరలివస్తుండటంతో వసతి గదులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. భీమవరం, ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు వంటి పట్టణాల్లోని దాదాపు 150 హోటళ్లలో ఒక్క గది కూడా ఖాళీ లేదు. డిమాండ్‌ను సాకుగా చూపుతూ యజమానులు అద్దెలను భారీగా పెంచేశారు. సాధారణంగా రోజుకు రూ. వెయ్యి నుంచి రూ. 5 వేలు ఉండే గది ధర, ఇప్పుడు మూడు రోజుల ప్యాకేజీ కింద రూ. 30 వేల నుంచి రూ. 60 వేల వరకు పలుకుతోంది. భీమవరంలోని కొన్ని ప్రముఖ హోటళ్లలో మూడు రోజులకు గాను ఒక్కో గదికి రూ. లక్ష చొప్పున వసూలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజకీయ నాయకులు సైతం గెస్ట్ హౌస్‌లను ముందే రిజర్వ్ చేయడంతో సామాన్య పర్యాటకులకు వసతి భారంగా మారింది. ఈసారి బరుల వద్ద పందేల జోరు మరింత పెరగనుంది. ఇప్పటికే నిర్వాహకులు పందెంగాళ్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తాడేపల్లిగూడెంలో రూ. 2.5 కోట్లతో ఒక భారీ పందెం సిద్ధమవ్వగా, సీసలి, నారాయణపురం, చినఅమిరం వంటి ప్రాంతాల్లో రూ. కోటి పందేలకు సిండికేట్లు కాలుదువ్వుతున్నాయి. గత ఏడాది పెద్ద మొత్తంలో గెలిచిన పందెంగాళ్లను తమ బరులకు రప్పించేందుకు నిర్వాహకులు పోటీ పడుతున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకల కోసం ఇప్పటికే ప్రైవేటు ఇళ్లు, కల్యాణ మండపాలు కూడా అద్దెకు తీసుకుంటున్నారు.

## గిరిజన గ్రామాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



**భీమవరం, పతాకం న్యూస్:** గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, ఆర్డీవో రామ్మోహనరావు, డీడీ వో కిరణ్‌కుమార్ అన్నారు. కృపావలసలో ఐదు గ్రామాల గిరిజనులు సమా వేశమై తమకు జరుగుతున్న అన్యాయంపై ని రసన తెలిపిన నేపథ్యంతో కలెక్టర్ రామసుందర్ రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు గిరిజన గ్రామాలకు చేరుకుని అక్కడ ప్రజలతో ప్రత్యేకంగా గ్రామసభ నిర్వ హించారు. గిరిజనుల ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో వారు గ్రామా లకు రహదారి సౌకర్యం లేదని, అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి రోగులను తీసుకెళ్ల డానికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. బోరు బావుల నుంచి బురద నీరు వస్తోందని, అదే మాకు ఆధారమన్నారు. విద్యుత్ సౌకర్యం లేదని చీకటి పడితే బిక్కుమంటూ జీవిస్తున్నామన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు, ఆధార్ కార్డు, రేషన్ కార్డులు ఇప్పించాలని కోరారు. సాలూరు మండలం కోదమ, పట్టెచెన్నూరు గ్రామాల నుంచి బతుకు తెరువు కోసం ఇక్కడకు తాము వచ్చామన్నారు. గోపాలరాయుడుపేట పంచాయితీలో విలీనం చేసి, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ అటవీ భూములను ఇష్టానుసారంగా సాగుచేయడం నేరమన్నారు. అనంతరం డీడీవో మాట్లాడుతూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమం లో ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, అటవీ రేంజ్ అధికారి రాజగోపాలరావు, పీఆర్ ఏఈ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజ, విద్యుత్ శాఖ ఏఈ రఘు, పంచాయతీ కార్యదర్శి జి.ఉమ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## తిరుమల పవిత్రతపై వైసీపీ కుట్రలు.. ఎంపీ పుట్టా మహేశ్ ఫైర్



**భీమవరం, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ పవిత్రతను పాడు చేసే విధంగా వైసీపీ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. సాక్షి ఛానల్ విలేకరులే మద్యం సీసాలు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమలలో అపవిత్ర కార్యక్రమాలు జరుగుతున్నాయని వారు చెప్పడం సిగ్గుచేటని ఫైర్ అయ్యారు. మద్యం సీసాలు కొనుగోలు చేసిన జియో ట్యాగింగ్‌తో సహా ఆధారాలన్నీ ఉన్నాయని చెప్పుకొచ్చారు. శనివారం తూర్పుగోదావరి జిల్లాలో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు మహేశ్ కుమార్. వైకుంఠ ఏకాదశిని తిరుమలలో ఎలాంటి చిన్న ప్రమాదం జరగకుండా నిర్వహించారని తెలిపారు. వైసీపీ నాయకులు భగవంతుడు దగ్గర కూడా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో జగన్ ప్రభుత్వం లడ్డూను అపవిత్రం చేసిందని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం ఏదైనా తప్పు చేస్తే ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతిపక్ష పార్టీల బాధ్యత అని చెప్పుకొచ్చారు. వైసీపీ దేవాలయాలను రాజకీయాల కోసం ఉపయోగించుకోవడం సరైనది కాదని పుట్టా మహేశ్ కుమార్ హితవు పలికారు.

# అడవులను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం అడుగులు?

## వాణిజ్య తోటల పెంపకానికి మోడీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోని అడవులను ప్రయివేటుపరం చేసేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. దేశంలో అటవీ సంరక్షణకు సంబంధించిన చట్టాలను మరింత బలహీనపరుస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంఓఇఎఫ్‌సిసి) కీలక నిర్ణయం తీసుకున్నది. అటవీ భూముల్లో ప్రయివేటు, ప్రభుత్వ సంస్థలు వాణిజ్య తోటలు వేసుకునేందుకు అనుమతిస్తూ సంబంధిత మార్గదర్శకాలకు కీలక సవరణలు చేసింది. అటవీ భూముల్లో వాణిజ్య తోటలు పెంపకం కార్యక్రమాలను ఇకపై 'అటవీ కార్యకలాపాలు'గా పరిగణిస్తూ.. వాటికి నెట్ ప్రజెంట్ వ్యాల్యూ (ఎన్‌పివి) చెల్లింపు, పరిహార అటవీకరణ వంటి రక్షణ చర్యలను తొలగించింది. 2023లో అమల్లోకి వచ్చిన వన్ (సంరక్షణ మరియు అభివృద్ధి) అధినియం మార్గదర్శకాలకు ఈనెల 2న సవరణలు చేసింది. ఈ సవరణ పరిశ్రమలకు మేలు, అడవుల జీవ వైవిధ్యానికి తీవ్ర నష్టం కలిగించేదిగా ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2023 నాటి మార్గదర్శకాలకు ఈనెల 2న సంబంధిత మంత్రిత్వ శాఖ ఆమోదించిన ఒక సవరణ ద్వారా తాజా మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో అడవుల్లో వాణిజ్య తోటలను ఏర్పాటు చేయడానికి మరిన్ని సడలింపులు ఇచ్చినట్టయ్యింది. ఇప్పటి వరకు అడవి భూమిని లీజుకు తీసుకొని తోటలు వేయాలంటే అది 'అటవీయేతర కార్యకలాపం'గా పరిగణించబడేది. దీనికి ప్రయివేటు లేదా ప్రభుత్వ సంస్థలు తప్పనిసరిగా పరిహార అటవీకరణ చేయాలి. అలాగే 'కంపా'కు ఎన్‌పివి చెల్లించాల్సి ఉండేది. కానీ తాజా సవరణతో ఈ రెండింటినీ కేంద్రం పూర్తిగా తొలగించింది. అటవీ సలహా కమిటీ గతనెల డిసెంబర్ 2న సమావేశమైంది. దేశంలో కాగితం, పల్ప్, పేపర్‌బోర్డు దిగుమతులు భారీగా పెరిగాయని పేర్కొన్నది. 2024-25లో కాగితం దిగుమతులు 2.05 మిలియన్ టన్నులకు చేరగా.. 2020-21లో అవి 1.08 మిలియన్ టన్నులే. ఈ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'క్షణించిన అడవీ ప్రాంతాల్లో' తోటలు అవసరమని కమిటీ అభిప్రాయపడింది. అందుకే రాష్ట్ర అటవీ శాఖలు రూపొందించే వర్కింగ్ ప్లాన్ లేదా మేనేజ్‌మెంట్ ప్లాన్ ఆధారంగా ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో తోటలు ఏర్పాటు చేయడాన్ని కేంద్రం అనుమతించింది.

కేంద్రం నిర్ణయంపై పర్యావరణవేత్తలు, నిపుణుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. "వాణిజ్య తోటలు అడవులు కావు. ఇవి జీవ వైవిధ్యాన్ని నాశనం చేస్తాయి. ఈ మార్పు జీవ సంరక్షణ లక్ష్యాలకు పూర్తిగా విరుద్ధం" అని పర్యావరణవేత్త రిత్విక్ దత్తా అన్నారు. "నిబంధనలను మరింత సడలించారు. పరిశ్రమలకు లాభం చేకూర్చేందుకే ఈ మార్పును తీసుకొచ్చారు. దేశ పర్యావరణ భద్రతకు ఇది ప్రమాదకరం" అని మాజీ ఐఎఫ్ఎస్ అధికారి ప్రకృతి శ్రీవాస్తవ తెలిపారు. "ప్రయివేటు సంస్థలు వేగంగా పెరిగే యూకలిప్టస్, టీక్ వంటి చెట్లనే పెంచుతాయి. ఇవి వన్యప్రాణులకు అవసరమైన పొదలు, మృత వృక్షాలు, సహజ నిర్మాణాన్ని కలిగి ఉండవు. ఒక తోట ఎన్నటికీ అడవి కాలేదు" అని ఓ సీనియర్ అధికారి చెప్పారు. ఈ నిర్ణయం దేశంలోని అడవులకు విపత్తు కలిగిస్తుందని మాజీ ఐఎఫ్ఎస్ అధికారి ఆర్‌పీ బాల్వాన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. పరిశ్రమల ప్రయోజనం కోసమే ఈ నిర్ణయాన్ని తీసుకున్నారనీ, 1980 నుంచి కార్పొరేట్లు అడవీ భూమిపై కన్నేశాయని అన్నారు. తాజా నిర్ణయంతో వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని తెలిపారు.

కేంద్రం నిర్ణయం ఇటు రాజకీయంగానూ తీవ్ర దుమారాన్నే రేపుతున్నది. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తాజా మార్పులను తీవ్రంగా తప్పుబట్టారు. 2023లో ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ సవరణల సమయంలోనే అడవుల ప్రయివేటీకరణ జరుగుతుందని తాము హెచ్చరించామని ఆయన గుర్తు చేశారు. తాజా పరిణామం దానికి నిదర్శనమనీ, ఇది ఆరంభం మాత్రమేనని ఆయన ట్వీట్ చేశారు. వన్ అధినయం చట్టంలోని సెక్షన్ 3సి కేంద్రానికి ప్రత్యేక అధికారాలను కల్పించింది. పార్లమెంటు అనుమతి లేకుండానే కేంద్రం ఆదేశాలు, సవరణలు చేయొచ్చు. దీంతో తాజా నిర్ణయం సర్వత్రా తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నది. దేశంలోని అడవుల పరిరక్షణ, జీవవైవిధ్యం, వన్యప్రాణుల భద్రత.. ఇవన్నీ దేశ భవిష్యత్‌కు చాలా కీలకం. కానీ కేంద్రంలోని మోడీ సర్కారు అవేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. ఇలాంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నది. తాజా నిర్ణయం పర్యావరణ పరిరక్షణను తాకట్టు పెట్టి పరిశ్రమలకు ప్రయోజనాలను అందిస్తుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్పులు భారత అటవీ విధానాన్ని ఏ దిశగా తీసుకెళ్లాయోనన్న భయాన్ని వెలిబుచ్చుతున్నారు.

# విశాఖ సమ్మిట్‌లో కార్మికుల సంక్షేమంపై చర్చించండి




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు విడనాడాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మె మోడీ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక కావాలని కార్మిక సంఘాల అఖిల భారత నాయకులు పిలుపునిచ్చారు. హరి కిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో జాతీయ కార్మిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సుదీప్ దత్తా (సిఐటియు), హరిద్వార్ సింగ్ (ఎఐటియుసి), అమిత్ యాదవ్ (ఐఎన్‌టియుసి), చంపా వర్మ (హెచ్‌ఎంఎస్), విజరు పాల్ సింగ్ (ఎఐయుటియుసి), సుచేత దే (ఎఐసిసిటియు), ఆర్‌కె మౌర్య (ఎల్‌పిఎఫ్), ఆర్ఎస్ డాగర్ (యుటియుసి) అధ్యక్ష వహించారు. ఎలమరం కరీం (సిఐటియు), అమర్జీత్ కౌర్ (ఎఐటియుసి), అశోక్ సింగ్ (ఐఎన్‌టియుసి), హర్భజన్ సింగ్ సిద్ధూ (హెచ్‌ఎంఎస్), ఆర్‌కె శర్మ (ఎఐయుటియుసి), రాకేష్ మిశ్రా (టియుసిసి), అషాబెన్ లతా బెన్ (ఎస్‌ఈడబ్ల్యుఎ), రాజీవ్ దిమ్రి (ఎఐసిసిటియు), జవహర్ సింగ్ (ఎల్‌పిఎఫ్), శత్రుజీత్ సింగ్ (యుటియుసి) తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా డిమాండ్లు, భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించిన డిక్లరేషన్‌ను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేసే సీడ్ బిల్లు (విత్తన బిల్లు) ముసాయిదాను, విద్యుత్ బిల్లును వెనక్కి తీసుకోవాలని, జిఆర్ఎఎంజి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 16న దేశవ్యాప్తంగా అన్నిగ్రామాల్లో, మండలాల్లో ఆందోళనకు ఎస్‌కెఎం ఇచ్చిన పిలుపుకు వారు మద్దతు తెలిపారు. సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇచ్చినందుకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)కు వారు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ విద్యుత్ ఉద్యోగులు అండ్ ఇంజనీర్ల సమన్వయ కమిటీ (ఎన్‌సిసిఓఇఇఇ) కూడా ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో విద్యుత్ ఉద్యోగులు, వినియోగ దారులతో సంయుక్త సమావేశాలు, సదస్సులు నిర్వహిస్తామని తెలిపింది. "రాబోయే సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి. విస్తృతంగా ప్రచారం ప్రారంభించాలి. పోరాటానికి తమ సంఘాలను సిద్ధం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు యావత్ కార్మిక వర్గానికి, శ్రామిక ప్రజలకు పిలుపునిస్తున్నాయి" అని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. "లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ పార్లమెంట్ ఆవరణలో ఇండియా బ్లాక్ పార్టీలు నిర్వహించిన నిరసన చర్యను స్వాగతిస్తూనే, కార్మికుల ప్రాథమిక హక్కులను కాపాడటానికి, దేశ ప్రజాస్వామ్య-లౌకిక స్వరూపాన్ని రక్షించడానికి ఈ సమ్మెకు మద్దతుగా ముందుకు రావాలని కోరాయి. యువత, విద్యార్థులు, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు సమ్మెలో భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తున్నాం" అని తెలిపారు.

ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎలమరం కరీం మాట్లాడుతూ "దేశంలో అన్ని రంగాలలోనూ పరిస్థితి దిగజారుతుంది. కార్మిక సంఘాలను అరికట్టడానికి, కార్మిక వర్గ ఉద్యమాన్ని నియంత్రించేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం రూపొందించింది. లేబర్ కోడ్‌లను పార్లమెంటులో ఆమోదించినప్పటి నుండి దేశ కార్మికులు ఐదు భారీ సార్వత్రిక సమ్మెలను నిర్వహించారు. 25 కోట్ల మంది కార్మికులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెతో పాలక వర్గానికి గట్టి సందేశం ఇవ్వాలి" అని అన్నారు. అన్ని వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజా సేవలను ప్రైవేటీకరించడం, దేశీయ, విదేశీ బడా కార్పొరేట్‌లకు విక్రయించే ఎజెండాను మోడీ ప్రభుత్వం కొనసాగిస్తోందని. తద్వారా స్వదేశీ పారిశ్రామిక వృద్ధి, స్వావలంబన, ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలో పడేస్తోందని కరీం విమర్శించారు.

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్ జిత్ కౌర్ మాట్లాడుతూ "సామాన్య ప్రజలు ప్రాథమిక సేవలు కోల్పోతున్నారు. అవినీతి, అసమానతలు పెరుగుతున్నాయి. ప్రాథమిక సేవలు కుప్పకూలిపోతున్నాయి. కలుషితమైన తాగునీటితో ప్రజలు మరణిస్తున్నారు. విద్య, ఆరోగ్యం వ్యాపారీకరణతో ఆ ఖర్చులను సామాన్యులు భరించలేకపోతున్నారు" అని పేర్కొన్నారు.

# చలికాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే..!

శీతాకాలం ఎండ తక్కువగా రావడంతో సరిపడా 'డి' విటమిన్ శరీరానికి అందదు. తక్కువ ఉష్ణోగ్రత కారణంగా వ్యాయామం చేయడానికి శరీరమూ సహకరించదు. వీటికి తోడు ఆకలి, దాహం ఉండదు. ఇవన్నీ రోగ నిరోధకశక్తిపై ప్రతికూల ప్రభావం చూపు తాయని నిపుణులు అంటున్నారు. ఇవే కాదు, ఈ సీజన్‌లో తీసుకొనే ఆహారం విషయంలో తెలిసో తెలియకో చేసే కొన్ని పొరపాట్లు కూడా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని చెబుతున్నారు. ఇలా జరగకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఈ క్రమంలో ఇంతకీ ఏంటా పొరపాట్లు? వాటిని సరిదిద్దుకొనే మార్గాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం! చాలా మంది ఆహారాన్ని వృథ చేయడం ఇష్టం లేక ఉదయం మిగిలినవి రాత్రికి, రాత్రి మిగిలినవి మరుసటి రోజు తింటుంటారు. చలికాలంలోనూ ఇలాగే చేస్తుంటారు. కానీ, ఇది ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే, ఈ సీజన్‌లో జీర్ణశక్తి తక్కువగా ఉంటుందని.. ఇలాంటప్పుడు ఒక పూట మిగిలినవి మరో పూట తినడం వల్ల అరుగుదల శక్తి మరింతగా తగ్గిపోతుందని తెలియజేస్తున్నారు. తద్వారా ఆహారం జీర్ణం కాక కడుపుబ్బరం, గ్యాస్ట్రిక్, వికారం, వాంతులు వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే, చలికాలంలో ఏ పదార్థం తీసుకున్నా వేడివేడిగా తీసుకోవడమే శ్రేయస్కరం అని సూచిస్తున్నారు.



చలికాలంలో తినే ఆహారపదార్థాల్లో శక్తి ఎక్కువగా ఉండేవి తీసుకోవాలి. విటమిన్ సి ఎక్కువగా ఉండే పండ్లు తినటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నట్స్, బాదం పప్పు లాంటివి తీసుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి. వేడివేడిగా ఉన్న ఆహారపదార్థాలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

మామూలుగానే ఈ సీజన్‌లో జీర్ణశక్తి మందగిస్తుంటుంది. ఈ చలికి ఉదయాన్నే నిద్ర లేచి వ్యాయామం కూడా చేయాలనిపించదు. దీంతో బరువు తగ్గే ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని నిపుణులు అంటున్నారు. కాబట్టి, ఇలాంటి సమయంలో నెయ్యిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మరింత బరువు పెరుగుతామని కొంతమంది భావిస్తుంటారు. కానీ, ఇది నిజం కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే, మంచి కొవ్వులు అధికంగా ఉండే నెయ్యి కడుపు నిండిన భావనను కలిగిస్తుందని చెబుతున్నారు. తద్వారా చిరుతిండ్ల పైకి మనసు మళ్లకుండా జాగ్రత్తపడచ్చని సూచిస్తున్నారు. అలాగే, ఇది ఆహారపు కోరికల్ని తగ్గించి శరీరంలో పేరుకుపోయిన కొవ్వుల్ని కరిగించేందుకు సహకరిస్తుందని పేర్కొంటున్నారు. ఈ రెండు ప్రయోజనాలూ బరువు పెరగకుండా నియంత్రణలో ఉంచుకునేందుకు దోహదం చేస్తాయంటున్నారు. అందుకే, ఏ సీజన్ అయినా ఒక స్పూన్ నెయ్యిని తీసుకోవడం ఆరోగ్యకరమని చెబుతున్నారు. చలికాలంలో వాతావరణం సహజంగానే పొడిగా ఉంటుంది. దీనికి తోడు దాహం వేయట్లేదని కొందరు నీళ్లూ సరిగ్గా తాగరు. ఫలితంగా, శరీరం డీహైడ్రేట్ అవడం, చర్మం పొడిబారడం వంటి సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. అయితే, ఇలాంటి సమయంలో కొంతమంది అదే పనిగా స్నాక్స్, ప్రిజర్వేటివ్స్ కలిపిన పదార్థాలు వంటివి తీసుకుంటూ ఉంటారని చెబుతున్నారు. వీటిలో కొన్నింటిని నీటి శాతం పూర్తిగా తొలగించి తయారు చేస్తుంటారని తెలియజేస్తున్నారు. ఇలాంటి పొడి పదార్థాలు ఈ కాలంలో తీసుకోవడం వల్ల శరీరం మరింత డీహైడ్రేట్ అవుతుందని పేర్కొంటున్నారు. తద్వారా చర్మం ఎక్కువగా పొడిబారుతుందని హెచ్చరిస్తున్నారు. శీతాకాలంలో తగినంతగా హైడ్రేటెడ్‌గా ఉండటం కూడా ముఖ్యమని అధ్యయనం పేర్కొంది. సాధారణంగా మహిళలు రోజుకు సగటున 9 కప్పులు, పురుషులు సగటున 13 కప్పుల నీటిని తాగాలని చీ×స అధ్యయనం పేర్కొంది. ఈ చల్లటి వాతావరణంలో వేడివేడిగా కాఫీ లేదా టీ తాగితే ఆ హాయే వేరుగా ఉంటుంది కదూ! అయితే, కొందరు వీటిని అమితంగా తీసుకుంటుంటారు. ఫలితంగా, ఇందులోని కెఫీన్ శరీరాన్ని డీహైడ్రేట్ చేసి నిద్ర సమయాలకు అంతరాయం కలిగిస్తుందంటున్నారు నిపుణులు. అలాగే, ఇది శరీరంలో నీటిని నిలుపుకొనే సామర్థ్యాన్ని తగ్గించి మూత్రవిసర్జనను పెంచుతుందని చెబుతున్నారు. దీనివల్ల కూడా శరీరం డీహైడ్రేట్ అయి అలసట దరిచేరుతుందని తెలియజేస్తున్నారు.

కాబట్టి ఈ సమస్యలేవీ ఎదురుకాకుండా జాగ్రత్తపడాలని సూచిస్తున్నారు. అందుకే టీ, కాఫీలు మితంగా తీసుకోవడం లేదా మధ్యమధ్యలో తులసి, అల్లం, దాల్చినచెక్కతో తయారుచేసిన పానీయాలు తాగడం మేలంటున్నారు. వీలైనంత వరకు సాయంత్రం, రాత్రి వేళల్లో కాఫీ లాంటి వాటి జోలికి వెళ్లకపోవడమే ఉత్తమని ఎశ్రీవఉవశ్రీఖఅస-ఎశ్రీఱఅఱఎ అధ్యయనంలో తెలిపింది. చక్కెరలు అధికంగా ఉండే ఈ పదార్థాలు రోగనిరోధక శక్తిని తగ్గించడంతో పాటు అలసటగా అనిపించేలా చేస్తాయంటున్నారు నిపుణులు. వివిధ వ్యాధులు, ఇన్ఫెక్షన్లతో పోరాడే తెల్ల రక్తకణాలను నాశనం చేస్తాయని చెబుతున్నారు. అందుకే చలికాలంలో స్వీట్లు తీసుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అలాగే, ఆయా తీపి పదార్థాల తయారీలో చక్కెరకు బదులుగా బెల్లం, ఖర్జూరాలు, తేనె వంటివి వాడడం మేలని సలహా ఇస్తున్నారు. అలాగే, ఈ జాగ్రత్తలతో పాటు సులభంగా జీర్ణమయ్యే సూప్స్, శరీరంలో వేడి ఉత్పత్తి చేసే మసాలాలు, రోగనిరోధక శక్తిని పెంచే నట్స్ వంటివి తీసుకోవడం ఆరోగ్యకరమని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ కాలంలో ఏవైనా ఆహార పదార్థాలు శరీరానికి సరిపడకపోయినా వాటిని పూర్తిగా పక్కన పెట్టేయడం మంచిదని సూచిస్తున్నారు.

# దువ్వినప్పుడు జుట్టు రాలుతోందా?



జుట్టును అదే పనిగా దువ్వుకుంటే ఎక్కువగా రాలిపోతుందని చాలా మంది అనుకుంటారు. అందుకే, ఏదో అలా పైపైన దువ్వుకొని జడ వేసేసుకుంటారు. అయితే ఇలా చేయడం వల్ల కూడా చిక్కులు కట్టి జుట్టు రాలిపోతుంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే హడావిడిగా కాకుండా, కుదుళ్ల నుంచి చివర్ల దాకా నిదానంగా జుట్టును దువ్వుకోవాలంటున్నారు. ఫలితంగా కుదుళ్లకు రక్తప్రసరణ మెరుగై ఒత్తుగా పెరుగుతుందని సూచిస్తున్నారు. ఈ క్రమంలో జుట్టును నెమ్మదిగా ఎందుకు దువ్వుకోవాలో తెలుసుకుందాం! సాధారణంగా మనం రోజూ జుట్టు దువ్వుకునే క్రమంలో సుమారు 50 నుంచి 100 వెంట్రుకల దాకా రాలిపోతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే కాస్త సమయం వెచ్చించి నెమ్మదిగా దువ్వుకోవడం వల్ల జుట్టు రాలే సమస్య క్రమంగా తగ్గుతుందని అంటున్నారు. ఎందుకంటే, కుదుళ్లలో సహజసిద్ధమైన నూనెల్ని విడుదల చేసే సెబేషయస్ గ్రంథులుంటాయని, దువ్వే క్రమంలో అవి ప్రేరేపితమై అవసరమైన మొత్తంలో నూనెల్ని విడుదల చేస్తాయని వివరిస్తున్నారు. ఫలితంగా కుదుళ్లు, జుట్టు తేమను కోల్పోకుండా ఉంటాయని పేర్కొంటున్నారు. ఇది జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తుందంటున్నారు. జుట్టులో దుమ్ము-ధూళి చేరి, సరిగ్గా దువ్వకపోతే చిక్కులు కట్టినట్లుగా తయారవుతుందని నిపుణులు చెబుతున్నారు. జుట్టు రాలడానికి ఇదీ ఓ కారణమంటున్నారు. కాబట్టి, ఇలాంటప్పుడు చిక్కులు తొలగిస్తూ జుట్టును దువ్వుకోవడం వల్ల జుట్టు రాలకుండా ఉండడంతో పాటు వెంట్రుకలు-కుదుళ్లలో చిక్కుకున్న దుమ్ము-ధూళి కూడా తొలగిపోతాయని సూచిస్తున్నారు.

"మనుషులు జుత్తుతో ఆకర్షణీయంగా కనిపిస్తారా? - షేవ్డ్ హెడ్‌తోనా?" - మీకు తెలుసా? జుట్టు దువ్వుకోవడం మంచిదన్నాం కదా అని ఎలా పడితే అలా, ఎంతసేపు పడితే అంతసేపు దువ్వుకోవడం కూడా మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దువ్వెన కుదుళ్లకు తాకేలా, వెంట్రుకల్లో చిక్కులు తొలగించుకుంటూ పై నుంచి కింది వరకు నెమ్మదిగా దువ్వుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో చెక్కతో చేసిన ప్యాడిల్ బ్రష్ లేదా దువ్వెన ఉపయోగిస్తే వెంట్రుకలు, కుదుళ్లు డ్యామేజ్ కాకుండా ఉంటాయంటున్నారు. జుట్టు దువ్వే ఫ్రీక్వెన్సీలను తగ్గించడం వల్ల జుట్టు రాలడం తగ్గుతుందని అధ్యయనం పేర్కొంది. చాలామంది తడిగా ఉన్న జుట్టును ఆరాక దువ్వుకుందాంలే అని వదిలేస్తుంటారు. తద్వారా వెంట్రుకలు చిక్కులు కట్టే అవకాశం ఉందని, అందుకే తడిగా ఉన్న జుట్టును ఇలా దువ్వుకోవాలంటున్నారు నిపుణులు. తలస్నానం చేశాక కండిషనర్ రాసుకోవాలని, ఒకవేళ ఈ అలవాటు లేని వారు దీన్ని వదిలేయచ్చు.

ఇప్పుడు బ్రిజిల్స్ మధ్య గ్యాప్ ఎక్కువగా ఉన్న, చివర్ల వద్ద మృదువైన బొడిపెల్లా ఉన్న దువ్వెన తీసుకొని కుదుళ్ల వద్ద నుంచి చివర్ల దాకా దువ్వుకుంటూ రావాలి. ఈ క్రమంలో ఎక్కడైనా చిక్కులు కట్టినట్లు అనిపిస్తే వేళ్లతో వాటిని తొలగించుకోవాలి. చిక్కులన్నీ తొలగిపోయాక, మరోసారి జుట్టును పై నుంచి కింది వరకు దువ్వుకుంటే సరిపోతుంది. తడి జుట్టు బలహీనంగా ఉంటుంది కాబట్టి చిక్కులు తొలగించుకునేలా దువ్వుకుంటే చాలు. జడ వేసుకున్నా, ముడేసుకున్నా, వదిలేసినా, జుట్టు ఎక్కువగా చిక్కులు కట్టేది చివర్ల వద్దే కాబట్టి ముందుగా ఆ భాగంలో చిక్కులు తొలగించుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

# డైరీ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక: అచ్చెన్నాయుడు



**కేరళ :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు డైరీ రంగం వెన్నెముకగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ ప్రాంతంలో సదరన్ డైరీ అండ్ ఫుడ్ కాన్‌క్లేవ్-2026 కార్యక్రమానికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమ ఉత్పత్తులను పరిశీలించి సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులకు నిత్య ఆదాయం, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించడంలో డైరీ రంగం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పశుపోషణ ఆర్థిక భద్రతనిచ్చే మార్గంగా మారిందని, పాల ఉత్పత్తి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. ప్రాచీన కాలం నుంచే పశుపోషణ మరియు డైరీ రంగం భారతీయ నాగరికత యొక్క ఆర్థిక, సామాజిక మరియు సాంస్కృతిక జీవితంలో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా డైరీ రంగం జాతీయ ఆర్థిక వ్యవస్థకే కాకుండా గ్రామీణ జీవనోపాధులకు, మహిళా సాధికారతకు మరియు పోషకాహార భద్రతకు కూడా ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. అందువల్ల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు శాస్త్రీయ అభివృద్ధులను అన్వయిస్తూ డైరీ రంగాన్ని మరింత బలోపేతం చేయడం మన అందరి సమిష్టి బాధ్యత అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. డైరీ రంగాన్ని మరింత లాభదాయకంగా, సార్థకంగా మార్చేందుకు శాస్త్రీయ మరియు సాంకేతిక పురోగతిని సమన్వయం చేస్తూ రంగాన్ని శక్తివంతం చేస్తున్న ఇండియన్ డైరీ అసోసియేషన్ చేసిన కృషిని మంత్రి హృదయపూర్వకంగా అభినందించారు. సదరన్ డైరీ అండ్ ఫుడ్ కాన్‌క్లేవ్--2026 గొప్ప విజయాన్ని సాధించి, దేశ డైరీ రంగం పురోగతికి గణనీయమైన తోడ్పాటు అందిస్తుందని ఆకాంక్షించారు. ఫెలిసిటేషన్‌కు సరైన వ్యక్తిని ఎంపిక చేసినందుకు కూడా ఇండియన్ డైరీ అసోసియేషన్‌ను అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. నారా భువనేశ్వరి, హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, అలాగే ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అని మంత్రి పేర్కొన్నారు. మూడు దశాబ్దాల కృషి మరియు దూరదృష్టి గల నాయకత్వంతో హెరిటేజ్ ఫుడ్స్ భారతీయ డైరీ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు.

# కీలకాంశాలు విస్మరించ తగునా..!



**అమరావతి, పతాకం న్యూస్:** వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాల్లోగా అంటే మార్చి నెలకల్లా పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టును సందర్శించిన ఆయన మీడియాతో కొన్ని విషయాలు ప్రస్తావించారు కానీ ఇంకొన్ని కీలకాంశాలు విస్మరించడం విస్తుగొలుపుతోంది. సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, పునరావాసం లభించని దుస్థితి ఇప్పటికీ కొనసాగడం అత్యంత విచారకరం. జలయజ్ఞంలో పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదించినపుడు ఒకటే దశ. కానీ రాష్ట్ర విభజన చట్టం దాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనడంతో నిర్మాణ బాధ్యత కేంద్రానిదయ్యింది. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మొదటంతా కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే బాధ్యతని, అంటే డ్యాం, ప్రధాన కాలువల నిర్మాణమేనని బుకాయించి, పునరావాస పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) విషయాన్ని దాటవేస్తూ వచ్చింది. ఆ తరువాత ప్రాజెక్టును రెండు దశలుగా మార్పించింది. డ్యాం 41.15 మీటర్ల ఎత్తు వరకు మొదటి దశగానూ, పూర్తి రిజర్వాయర్ మట్టం 45.72 మీటర్లు రెండోదశ అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీలు మారినా అప్పుడు, ఇప్పుడూ కేంద్రం కనుసన్నల్లో నడుచుకుంటున్నవే కనుక తలాడించాయి. అయితే, డ్యాం నిర్మాణం విషయంలో మాత్రం ఇది వర్తించదనీ, నిర్మాణం మొత్తం ఒకటిగానే పూర్తవుతుందని అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రులు చెబుతున్నారు. కాబట్టి నిర్వాసితులను పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా రిజర్వాయర్‌లో నీరు నింపి వెళ్లగొట్టడానికే ఈ కుట్ర. అందుకనే దశలవారీ కాకుండా పూర్తి ఎత్తు వరకూ ఆర్ ఆండ్ ఆర్ మొదట పూర్తి చేశాకనే ప్రాజెక్టు నిర్మాణం అని నిర్వాసితులు ఘోష పెడుతున్నారు.

మొదటి దశకు సంబంధించిన 41.15 మీటర్ల పరిధిలోని నిర్వాసితులకు 2027 జనవరికల్లా పునరావాసం పూర్తి చేయనున్నట్లు బుధవారంనాడు ముఖ్యమంత్రి చెప్పారు. ఆ లెక్కలు చూసినా మొదటి దశకు సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ అమలు సైతం ఇంకా ఆమడదూరంలో వుందని తేటతెల్లమవుతోంది. ప్రాజెక్టు పూర్తయి అన్ని ప్రాంతాలకు నీరు అందించడం మునక ప్రాంతంలో 1.20 లక్షల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమైతేనే సాధ్యమవుతుంది. నిర్వాసితులకు భూమికి భూమిగానీ, ఇల్లు కట్టించడంగానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుగానీ జరగలేదు. కట్టించిన కాలనీల్లో వర్షం వస్తే ఇళ్లు కారుతున్నాయి. శ్మశానాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటివేవీ లేవు. 1986లో ఒకసారి, 2022లో మరోసారి వచ్చిన వరద ప్రభావ ప్రాంతాలను పరిశీలిస్తే మునక ప్రాంతంలో జరిగిన కాంటూరు సర్వే, తరువాత చేపట్టిన లైడార్ సర్వే ఏదీ వాస్తవాలను వెల్లడించడం లేదని రుజువైంది. తాజాగా నిర్వాసితుల బ్యాంకు ఎకౌంట్లలో జమచేస్తున్న పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 2017కు ముందు అంచనాల ప్రకారం నిర్ణయించినవి కావడం గమనార్హం. 2017 తర్వాత డ్యామ్ అంచనాలు రెండుసార్లు సవరించారు కానీ నిర్వాసితులకు మాత్రం పాత ప్యాకేజిలే! పెళ్లయిన యువతులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడం లేదు. పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా ప్యాకేజీ అమలు చేయాలి కదా! నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. ఈ ప్రభుత్వం అయినా ప్యాకేజీ తాజా ధరలకు అనుగుణంగా సవరించి పెంచి ఇస్తుందేమోనని నిర్వాసితులు ఆశిస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి వాటి ఊసే ఎత్తుకోలేదు. పర్యటనలో డ్యామ్ నిర్మాణ పనులను ఆమూలాగ్రం పరిశీలించిన ఆయన ముంపు ప్రాంతాలను, పునరావాస కాలనీలను కూడా సందర్శిస్తే బాగుండేది. అక్కడి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే వాటిని సత్వరం పరిష్కరించడానికి, అనేక అవకతవకలను, సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దడానికి అవకాశం వుండేదని ప్రాజెక్టు బాధితుల భావన.డయాఫ్రం వాల్‌ను నాణ్యంగా నిర్మించనందున వరదలకు దెబ్బతిన్నది. విదేశీ నిపుణులు సైతం దీన్ని నిర్ధారించారు కానీ వారిచ్చిన నివేదికను బహిరంగపర్చలేదు. మరమ్మతులకు అదనంగా రూ.900 కోట్లు ఇచ్చారేతప్ప డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారణమైన కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిర్మాణంలో అవకతవకలను సరిచేయడానికి భవిష్యత్‌లో డ్యాం భద్రతకు అవసరమైన చర్యలను పారదర్శకంగా తీసుకోవాలి. కానీ డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా కనిపెట్టలేకపోయారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆరేడు సంవత్సరాలు ఆలస్యం అవుతోందని సిఎం చంద్రబాబు చెప్పారే తప్ప అందుకు కారణమైన కాంట్రాక్టర్, ఆనాటి పనులు సర్టిఫై చేసిన ఉన్నతాధికారులు, గత ప్రభుత్వంలో ఈ అంశాల్లో నిర్ణయాలు చేసినవారిపై ఎలాంటి చర్యలనూ వెల్లడించలేదు.




## దిగ్గజాల ఆల్‌టైమ్ రికార్డ్స్‌పై
# రోహిత్ శర్మ గురి



2025 ఏడాదిని ఘనంగా ముగించిన టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ కొత్త సంవత్సరంలో బరిలో దిగేందుకు రెడీ అయ్యాడు. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో హిట్?మ్యాన్ ఆడనున్నాడు. జనవరి 11న వడోదర వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో రోహిత్ శర్మ తాజాగా వడోదరకు చేరుకున్నాడు. అయితే కొత్త ఏడాదిలో హిట్‌మ్యాన్ పలు రికార్డులు అందుకునే ఛాన్స్ ఉంది. అందులో ఒకట్రెండు ఘనతలు ఈ సిరీస్‌లోనే సాధించే అవకాశం ఉంది. మరి ఆ రికార్డులు ఏంటంటే?రోహిత్ శర్మ ఇప్పటిదాకా 279 వన్డే మ్యాచ్?ల్లో 49.21 సగటుతో 11516 పరుగులు చేశాడు. మరో 484 రన్స్ చేస్తే వన్డేల్లో 12వేల పరుగుల క్లబ్?లో చేరతాడు. దీంతో ఈ మైలురాయి అందుకున్న భారత మూడో క్రికెటర్‌గా రోహిత్ అరుదైన ఘనత ఖాతాలో వేసుకుంటాడు. భారత్? నుంచి ఇప్పటిదాకా దిగ్గజం సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ ఇద్దరే వన్డేల్లో ఈ మార్క్ అందుకున్నారు. ఓవరాల్‌గా ఏడో బ్యాటర్‌గా నిలుస్తాడు.అలాగే మరో 224 పరుగులు చేస్తే, పాకిస్థాన్ మాజీ క్రికెటర్ ఇంజమామ్ ఉల్ హక్ (11739 పరుగులు)ను అధిగమిస్తాడు. ఇంకో 63 పరుగులు చేస్తే సౌతాఫ్రికా దిగ్గజం జాక్ కలీస్ (11579 పరుగులు) ను దాటేస్తాడు. ఈ ఇద్దరినీ ఇదే సిరీస్‌లో దాటేసే అవకాశం ఉంది.ఇంటర్నేషనల్ వన్డే కెరీర్‌లో హిట్‌మ్యాన్ ఇప్పటిదాకా 96 సార్లు 50+ స్కోర్లు నమోదు చేశాడు. ఇందులో 33 సెంచరీలు, 61 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే మరో ఆరు 50+ స్కోర్లు నమోదు చేస్తే, వన్డే కెరీర్‌లో 100 సార్లు 50+ స్కోర్లు చేసిన బ్యాటర్‌గా అరుదైన రికార్డు సాధిస్తాడు.వన్డే కెరీర్‌లో రోహిత్ శర్మ ఇప్పటిదాకా 355 సిక్స్‌లు బాదాడు. ప్రస్తుతం వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా రోహిత్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే మరో 45 సిక్స్‌లు బాదితే వన్డేల్లో 400 సిక్స్‌ల మార్క్ అందుకున్న తొలి క్రికెటర్‌గా నిలుస్తాడు.18ఏళ్ల సుదీర్ఘ ఇంటర్నేషనల్ కెరీర్‌లో రోహిత్ ఇప్పటిదాకా మూడు ఫార్మాట్లలో కలిపి 50 శతకాలు నమోదు చేశాడు. మరో ఈ లిస్ట్?లో పదో స్థానంలో ఉన్నాడు. క్రికెట్‌లో దిగ్గజాలు బ్రియన్ లారా (53), మహేల జయవర్దనే (54), హషీమ్ ఆమ్లా (55)కు మరో 5 సెంచరీల దూరంలో ఉన్నాడు. ఈ ఏడాది ఇంకో 6 శతకాలు బాదితే వీళ్లను అధిగమించి ఏడో స్థానానికి దూసుకెళ్లే ఛాన్స్ ఉంది.

# సెలక్టర్ల నిర్ణయాన్ని గౌరవిస్తాను: గిల్



భారత వన్డే జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, త్వరలో జరగనున్న 2026 టీ20 ప్రపంచకప్ జట్టులో తనను ఎంపిక చేయకపోవడంపై తొలిసారి స్పందించాడు. న్యూజిలాండ్‌తో ఆదివారం జరగనున్న తొలి వన్డేకు ముందు మీడియాతో మాట్లాడుతూ, సెలక్టర్ల నిర్ణయాన్ని తాను గౌరవిస్తున్నట్లు తెలిపాడు. ఇటీవల కాలంలో పొట్టి ఫార్మాట్‌లో గిల్ ఫామ్ ఆశించిన స్థాయిలో లేదు. ఈ నేపథ్యంలో జట్టు కూర్పును దృష్టిలో ఉంచుకుని సెలక్షన్ కమిటీ అతడిని పక్కనపెట్టింది. టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు డిప్యూటీగా, వైస్ కెప్టెన్‌గా గిల్ స్థానంలో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను నియమించారు. ఈ విషయంపై గిల్ మాట్లాడుతూ.. "సెలక్టర్ల నిర్ణయాన్ని నేను గౌరవిస్తున్నాను. టీ20 ప్రపంచకప్‌లో పాల్గొంటున్న జట్టుకు నా శుభాకాంక్షలు. నేను ఎక్కడ ఉండాలో అక్కడే ఉన్నాను. నా తలరాతలో ఏది రాసి ఉందో దాన్ని ఎవరూ తీసివేయలేరు. దేశం కోసం అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని ప్రతి ఆటగాడు ప్రయత్నిస్తాడు. సెలక్టర్లు తమ నిర్ణయం తీసుకున్నారు" అని గిల్ చెప్పుకొచ్చాడు.




# 'మన శంకర వరప్రసాద్'కు టికెట్ రేట్ల పెంపునకు అనుమతి



మెగాస్టార్ చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఊరట కల్పించింది. సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ జీవో ప్రకారం, సినిమా విడుదలయ్యే జనవరి 12కు ముందు రోజు, అంటే జనవరి 11 ఆదివారం రాత్రి ప్రదర్శించే పెయిడ్ ప్రీమియర్ షోలకు టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ. 500 వరకు నిర్ణయించుకునే వెసులుబాటు కల్పించారు. ఇక విడుదలైన మొదటి 10 రోజుల పాటు పెరిగిన ధరలు అమల్లో ఉంటాయి. సింగిల్ స్క్రీన్లలో రూ. 100 (జీఎస్టీతో కలిపి మొత్తం టికెట్ ధర రూ. 247), మల్టీప్లెక్స్‌లలో రూ. 125 (జీఎస్టీతో కలిపి మొత్తం టికెట్ ధర రూ. 302) పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇదే కాలంలో రోజుకు 5 షోలు ప్రదర్శించుకోవచ్చని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో నయనతార హీరోయిన్‌గా నటించారు.

భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూర్చగా, సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొని ఉన్నాయి. సంక్రాంతి బరిలో నిలుస్తున్న ఈ సినిమాకు టికెట్ రేట్ల పెంపు నిర్ణయం కచ్చితంగా కలిసొస్తుందని, భారీ వసూళ్లు సాధించేందుకు దోహదపడుతుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. సినిమా కంటెంట్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటే, బాక్సాఫీస్ వద్ద చిరంజీవి మరో భారీ విజయాన్ని నమోదు చేయడం ఖాయమని అంచనా వేస్తున్నారు.

# ప్రభాస్‌ను కొత్తగా చూపించాలన్నదే నా ఉద్దేశ్యం: మారుతి



ప్రభాస్ కథనాయకుడిగా దర్శకుడు మారుతి 'రాజా సాబ్' సినిమాను తెరకెక్కించారు. భారీ బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమా, నిన్ననే థియేటర్లకు వచ్చింది. సంక్రాంతి కానుకగా వచ్చిన ఈ సినిమా, థియేటర్ల దగ్గర గట్టిగానే సందడి చేస్తోంది. అదే సమయంలో దర్శకుడు మారుతిపై విమర్శలు కూడా గట్టిగానే వినిపిస్తున్నాయి. అంచనాలను ఈ సినిమా అందుకోలేకపోయిందనే టాక్ బలంగా షికారు చేస్తోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన బ్లాక్ బస్టర్ మీట్ లో మారుతి మాట్లాడారు. " 9 నెలలకి ఒక సినిమా తీసే నేను .. ఈ సినిమా కోసం మూడేళ్లు కష్టపడ్డాను. ప్రభాస్ కి నచ్చేలా .. ఆయనను అభిమానులు ఎలా చూడాలనుకుంటున్నారో అలా చూపించడానికి ప్రయత్నిస్తూ ముందుకు వెళ్లాను. ప్రభాస్ ను సాధ్యమైనంత కొత్తగా చూపించాలనే ఉద్దేశంతోనే ఆయన పాత్రను డిజైన్ చేసుకోవడం జరిగింది. ప్రభాస్ తో నేను కూడా ఒక కమర్షియల్ సినిమా చేయవచ్చు .. ఈజీగా అయిపోతుంది కూడా. కానీ ఇలాంటి ఒక సినిమా చేయాలనే సంకల్పం ప్రభాస్ కి కూడా ఉండటం వలన చేయడం జరిగింది" అని అన్నారు. "ఈ సినిమాలో కొత్త పాయింట్ ను చెప్పడం జరిగింది. ఎప్పుడైనా సరే కొత్త పాయింట్ ఎక్కడానికి కొంత సమయం పడుతుంది. ఓ పది రోజులు పోతేగానీ ఈ సినిమా గురించిన రిజల్ట్ తెలియదు. ఈ లోగా తొందరపడి ఒక రోజులో .. ఒక షోతో సినిమా ఏమిటనేది డిసైడ్ చేయడం కరెక్టు కాదు. నేను చేసిన ప్రయత్నం కామన్ ఆడియన్స్ కి రీచ్ అయిందనే అనుకుంటున్నాను. క్లైమాక్స్ ఎపిసోడ్ కి మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రభాస్ ఓల్డ్ గెటప్ తెరపై ఎక్కువ సేపు కనిపించకపోవడం వలన, అభిమానులు అసంతృప్తికి లోనయ్యారనే విషయం మాకు అర్థమైంది. దాంతో ఉన్న కంటెంట్ ను కాస్త ట్రిమ్ చేసి, ప్రభాస్ ఓల్డ్ గెటప్ కి సంబంధించిన నిడివిని పెంచాము. ఈ రోజు సాయంత్రం 6 గంటల షో నుంచి ప్రేక్షకులకు అందుబాటులోకి వస్తుంది. ఈ ఎపిసోడ్ తప్పకుండా మైండ్ బ్లోయింగ్ గా ఉంటుంది. ఏదేమైనా నాలాంటి మిడ్ రేంజ్ దర్శకుడికి ఛాన్స్ ఇచ్చిన ప్రభాస్ గారికి నేను ఎప్పుడూ రుణపడి ఉంటాను" అని చెప్పారు.

# ప్రెగ్నెన్సీ రూమర్లపై క్లారిటీ ఇచ్చిన హీరోయిన్ అవికా గోర్



ఇటీవల అవికా గోర్ సోషల్ మీడియాలో పెట్టిన ఒక చిన్న పోస్ట్ పెద్ద చర్చకు దారి తీసింది. 'కొత్త ప్రారంభం' అనే క్యాప్షన్‌తో ఆమె షేర్ చేసిన పోస్ట్‌ను చూసి, అవికా తల్లి కాబోతున్నారంటూ సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. కొందరు అభిమానులు శుభాకాంక్షలు చెప్పడం మొదలుపెట్టగా, మరికొందరు ఇది ఒక హింట్ అని భావించారు. అయితే ఈ ప్రచారంపై తాజాగా అవికా స్పష్టమైన క్లారిటీ ఇచ్చారు.తన గురించి వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని అవికా గోర్ ఖండించారు. తాను తల్లి కాబోతున్నానన్న ప్రచారం పూర్తిగా రూమర్స్ మాత్రమేనని చెప్పారు. అసత్యమైన విషయాలను ఎందుకు ఇంత వేగంగా షేర్ చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న మాట లేదా పోస్ట్ చూసి అభిమానులు వెంటనే ఒక నిర్ణయానికి వచ్చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వార్తలు తనను అసౌకర్యానికి గురిచేస్తున్నాయని కూడా తెలిపారు.

అయితే, అదే సమయంలో ఒక విషయం మాత్రం ఆసక్తికరంగా మారింది. నిజంగానే తన జీవితంలో ఒక పెద్ద శుభవార్త ఉందని అవికా చెప్పారు. కానీ అది ఏంటన్నది మాత్రం ఇప్పుడే చెప్పలేనని, సరైన సమయంలో అధికారికంగా వెల్లడిస్తానని తెలిపారు. దీంతో నెటిజన్లు ఇది ఆమె కొత్త సినిమా లేదా కెరీర్‌కు సంబంధించిన అప్‌డేట్ అయి ఉండొచ్చని ఊహిస్తున్నారు.

తెలుగు ప్రేక్షకులకు అవికా గోర్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేని పేరు. 'ఉయ్యాలా జంపాలా' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఆమె, తొలి ప్రయత్నంలోనే మంచి విజయం అందుకున్నారు.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**